విలేకరులు కావలెను

పెన్ సత్తా తెలుగు దినపత్రిక

ఆంధ్రప్రదేశ్ అన్ని జిల్లా లకి పెన్ సత్తా దినపత్రికలో పనిచేయుటకు జిల్లా స్టాప్ రిపోర్టర్లు, నియోజకవర్గ ఇంచార్జ్ లు, మండల రిపోర్టర్లు కావలెను. వార్తలు పెట్టే వారికే ప్రాధాన్యత.

ఫోన్ నెం : 9885315759

RNI:APTEL/2023/87729

# పెన్ సత్తా

ప్రశ్నించడం అందరి హక్కు...

PEN SATTA Telugu Daily



సంపుటి : 3 సంచిక : 290 ఎడిటర్ : చింతమనేని అనిల్ కుమార్ శుక్రవారం 13 మార్చి 2026 పేజీలు : 08 వెల : 03

Published from Vishakapatnam Circulated by Vijayawada, Ongole, Chittoor, Kadapa, Tirupati. Nandyal, Hyderabad, Ananthapur, Kurnool

# విశాఖలో డెవలప్ మెంట్ సెంటర్, జీసీసీ ఏర్పాటు చేయండి

## క్యాప్ జెమినీ సీఈవో ఐమాన్ ఇజ్జత్ తో మంత్రి లోకేష్ భేటీ







**విశాఖపట్నం, మార్చి 12:** క్యాప్ జెమిని సీఈవో ఐమాన్ ఇజ్జత్ తో రాష్ట్ర విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ విశాఖపట్నంలో భేటీ అయ్యారు. రాష్ట్రంలో పెట్టుబడుల పై కీలక చర్చ జరిగింది. ఈ సందర్భంగా లోకేష్ మాట్లాడుతూ దార్శనిక ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సారథ్యంలో విశాఖపట్నం ఐటీ, డేటా సెంటర్ హబ్ గా శరవేగంగా అభివృద్ధి చెందుతోంది. దేశం లోనే అతిపెద్దదైన గూగుల్ డేటా సెంటర్ పనులు త్వరలోనే ప్రారంభం కాబోతున్నాయి. ఇప్పటికే కాగ్నిజెంట్, టీసీఎస్ లాంటి సంస్థలు విశాఖలో ల్యాండ్ అయ్యాయి. మరో మూడు నెలల్లో భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం ప్రారంభం కాబోతోంది. దేశంలో మరే ప్రాంతం లోని లేని ఐటీ ఎకో సిస్టమ్ విశాఖపట్నానికి మాత్రమే సొంతం. అన్నివిధాల అనుకూలతలు కలిగిన విశాఖలో 20 వేల ఉద్యోగాలు కల్పించే సామర్థ్యం గల ఐటీ డెవలప్ సెంటర్, జీసీసీ, క్లౌడ్ సర్వీసెస్, బీపీఎం వర్టికల్స్ సేవల కేంద్రాన్ని ఏర్పాటు చేయండి. ఆంధ్రప్రదేశ్ లో ఎమర్జింగ్ టెక్నాలజీ ల్యాబ్స్ (ఏఐ, క్లౌడ్, సైబర్ సెక్యూరిటీ, డిజిటల్ అభివృద్ధి, డిజిటల్ టాలెంట్ పైప్ లైన్) ఏర్పాటు కోసం ఏపీ విశ్వవిద్యాలయాలతో కలిసి కో డెవలప్ మెంట్ పార్టనర్ గా వ్యవహరించండి అన్నారు. క్యాప్ జెమినీ డెడికేటెడ్ క్వాంటం వర్టికల్ ను స్థాపించడమేగాక ఆప్టిమైజేషన్, ఫైనాన్సియల్ సర్వీసెస్, సస్టయినబిలిటీ వంటి రంగాల్లో ఎంటర్ ప్రైజ్ కస్టమర్ సేవల అభివృద్ధికి ప్రపంచ స్థాయి సాంకేతిక భాగస్వాములతో కలిసి పనిచేయండి. ఆంధ్రప్రదేశ్ లో క్వాంటం వ్యాలీ అభివృద్ధికి సహకారం అందించాల్సిందిగా మంత్రి లోకేష్ విజ్ఞప్తి చేశారు. క్యాప్ జెమినీ సీఈవో ఐమాన్ ఇజ్జత్ స్పందిస్తూ 1967 లో పారిస్ కేంద్రంగా ఏర్పాటైన తమ సంస్థలో ప్రపంచ వ్యాప్తంగా 3.4 లక్షల మంది ఉద్యోగులు పనిచేస్తుండగా, అందులో 2 లక్షల మంది వరకు ఒక్క భారత్ లోనే ఉన్నట్లు తెలిపారు. స్ట్రాటజీ & ట్రాన్స్ఫర్మేషన్, క్లౌడ్, డేటా & ఏఐ, డిజిటల్ ఇంజనీరింగ్, ఎంటర్ ప్రైజ్ ప్లాట్ ఫామ్స్, మేనేజ్డ్ సర్వీసెస్, సైబర్ సెక్యూరిటీలో కోర్ వర్టికల్స్ సేవలు అందిస్తున్నట్లు చెప్పారు. భారత్ లోని హైదరాబాద్, చెన్నై, ముంబయి, పూనే, నోయిడా, కోల్ కతా, గురుగ్రామ్, భువనేశ్వర్ సహా 13 నగరాల నుంచి తమ సంస్థ కార్యకలాపాలు కొనసాగుతున్నాయని చెప్పారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ప్రతిపాదనలను పరిశీలిస్తామని ఐమాన్ ఇజ్జత్ చెప్పారు. ఈ సమావేశంలో క్యాప్ జెమినీ ఇండియా సీఈవో సంజయ్ చాకే, డబ్ల్యూఎన్ఎస్ గ్లోబల్ సీఈవో కేశవ్ మురుగేష్ పాల్గొన్నారు. (క్యాప్ జెమినీ సంస్థ 23.9 బిలియన్ల వార్షికాదాయం సాధిస్తోంది.

## పర్యాటక రంగంలో పెట్టుబడుల పై సీఎం కీలక సమీక్ష



అమరావతి, మార్చి 12: అమరావతిలో క్రియేటివ్ సిటీని ఏర్పాటు చేయనున్నట్టు సీఎం చంద్రబాబు ప్రకటన. ఈ సందర్భంగా రెండో రోజు జిల్లా కలెక్టర్ల సమావేశంలో ముఖ్యమంత్రి మాట్లాడుతూ రాష్టంలో ఆతిధ్య రంగానికి పెద్ద ఎత్తున అవకాశాలు ఉన్నాయన్నారు. ఏమీ లేని ప్రాంతాల్లోనే కొన్ని దేశాల్లో టూరిజం అభివృద్ధి చేస్తున్నారు. ఏపీలో అనేక చరిత్రాత్మక ప్రాంతాలు, ఎన్నో పుణ్యక్షేత్రాలు ఉన్నాయి, వాటిని అభివృద్ధి చేసే అంశం పై ఫోకస్ పెట్టాలన్నారు. పురాతన కట్టడాలు చాలా ఉన్నాయి, వాటికి ఎంతో చరిత్ర ఉంటుంది, వాటిని ఎంకరేజ్ చేయాలన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 50 వేల హోటల్ గదులు సిద్ధం కావాలి,వివిధ ప్రాంతాల్లో హోమ్ స్టేలు పెద్ద ఎత్తున రావాలి, కన్వెన్షన్ సెంటర్లు, మైస్ సెంటర్లు నిర్మాణం చేయాలన్నారు.యుద్ధ ప్రభావాల నేపథ్యంలో విదేశాల కంటే స్థానికంగా ఉండే పర్యాటకానికి పెద్ద ఎత్తున ఆకర్షణ పెరుగుతుంది

- మిగతా 2లో

## పెట్టుబడులు గురించి ఆలోచించినట్టే పేదల గురించీ ఆలోచించాలని సీఎం



అమరావతి, మార్చి 12: వివిధ పథకాల లబ్దిదారులకు ప్రజా ప్రతినిధుల ద్వారా సంక్షేమ లేఖలు అందివ్వాలని సీఎం ఆదేశం. సంక్షేమ పథకాల పారదర్శకతతో అమలుకు, ఓనర్ షిప్ తీసుకునేందుకు సంక్షేమ లేఖలు ఇవ్వాలని నిర్ణయం.
త్వరలో సంక్షేమ క్యాలెండర్ విడుదల చేయనున్నట్టు ప్రకటించిన ముఖ్యమంత్రి. ఈ సందర్భంగా రాష్టం లోని జిల్లాల కలెక్టర్ రెండో రోజు సమావేశం సీఎం చంద్రబాబు మాట్లాడుతూ సంక్షేమ పథకాల

- మిగతా 2లో



## యుద్ధజ్వాలలు దాటి..

### భారత్‌కు చేరుకున్న చమురు నౌక

### రెండ్రోజుల్లో మరొకటి రాక..

ఢిల్లీ: పశ్చిమాసియా యుద్ధ జ్వాలలను దాటి చమురు నౌకలు భారత్‌కు చేరుకుంటున్నాయి. ఇందులో

- మిగతా 2లో

# ఎల్పీజీ బ్లాక్‌లో అమ్మేవారిని వదిలిపెట్టకండి

- రాష్ట్ర ప్రభుత్వాలకు ప్రధాని మోదీ దిశానిర్దేశం
- దేశంలో ఇంధన కొరత లేదని పార్లమెంటులో కేంద్రం ప్రకటన
- గ్రామీణ ప్రాంతాల్లో గ్యాస్ బుకింగ్ గడువును 45 రోజులకు పెంచుతూ నిర్ణయం
- రాష్ట్రాలకు 48 వేల కిలో లీటర్ల అదనపు కిరోసిన్ కేటాయిస్తున్నట్లు వెల్లడి

- మిగతా 2లో





## ఏపీ రైతులకు ఉగాది కానుక... నేడు అన్నదాత సుఖీభవ 3.0 సాయం

- అన్నదాత సుఖీభవ మూడో విడత నిధులు శుక్రవారం విడుదల
- 46.85 లక్షల మంది రైతుల ఖాతాల్లో రూ.6,000 చొప్పున జమ
- కృష్ణా జిల్లా సూరంపల్లిలో నిధులు విడుదల చేయనున్న సీఎం చంద్రబాబు
- ఏడాదికి రూ.20 వేల హామీ పూర్తి చేసిన కూటమి ప్రభుత్వం

ఉగాది కానుకగా కూటమి ప్రభుత్వం రైతన్నలకు 'అన్నదాత సుఖీభవ' నిధులు జమ చేయనుంది. 'అన్నదాత సుఖీభవ - పీఎం కిసాన్ 3.0'లో భాగంగా రైతులకు రేపు (మార్చి 13) ఆర్థిక సాయాన్ని విడుదల చేయనుంది. మూడవ విడతగా 46.85 లక్షల మందికి కేంద్ర, రాష్ట్ర వాటా కలిపి

- మిగతా 2లో

## ప్రతీకారం తీర్చుకుంటాం - ఇరాన్ కొత్త సుప్రీం లీడర్



అమెరికా- ఇజ్రాయెల్ దేశాలతో భీకర యుద్ధం కొనసాగుతున్న వేళ ఇరాన్ నూతన సుప్రీం లీడర్ ఆయతుల్లా మొజ్తాబా ఖమేనీ

- మిగతా 2లో

# గ్యాస్ కోసం ఉరుకులు పరుగులు



పశ్చిమాసియా సంక్షోభం నేపథ్యంలో దేశంలో వంట గ్యాస్ కొరత ఆందోళన కలిగిస్తోంది. విజయవాడలోని పలు ప్రాంతాల్లో హోటళ్లు, రెస్టారెంట్లు ఇప్పటికే తాత్కాలికంగా మూసేశారు. కొన్ని చోట్ల కట్టెల పొయ్యిలపై వంటలు చేస్తున్నారు. స్టార్టర్స్ వంటివి కట్టెలపై చేయలేమని, దీంతో ఆర్థికంగా నష్టపోతున్నామని హోటల్ యజమానులు చెబుతున్నారు. రోజులు గడిచే కొద్దీ రెండో సిలిండర్ ఇస్తారో, ఇవ్వరో అని నగరంలోని పలు గ్యాస్ ఏజెన్సీల వద్ద బుకింగ్ చేసుకునేందుకు వినియోగదారులు బారులుదీరుతున్నారు.

# ఎల్పీజీ బ్లాక్‌లో అమ్మేవారిని వదిలిపెట్టకండి

దిల్లీ: దేశంలో ఎల్పీజీ లభ్యతపై భయాందోళనలు సృష్టిస్తున్న వారిపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. వారు దేశానికి తీవ్ర నష్టం కలిగిస్తున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. ప్రస్తుత సంక్షోభంలో కొందరు వ్యక్తులు బ్లాక్ మార్కెటింగ్‌కు పాల్పడుతున్నారని, అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాలకు స్పష్టం చేశారు. ప్రధాని మోదీ 'ఎన్ఎక్స్‌టీ' సదస్సులో గురువారం ప్రసంగించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.."ఈ రోజు దేశంలో భయాందోళనలు సృష్టించడానికి కొంతమంది ప్రయత్నిస్తున్నారు. తమ ఎజెండాను నడపాలని అనుకుంటున్నారు. అలా చేయడం ద్వారా జనం ముందు తమ డొల్లతనాన్ని వారే బయటపెట్టుకుంటున్నారు. దేశానికీ నష్టం కలిగిస్తున్నారు. యుద్ధ ప్రభావం అన్ని దేశాలపైనా ఉంది. భారత్ కూడా ఈ సమస్య నుంచి బయటపడేందుకు ప్రయత్నిస్తోంది. కొవిడ్ నుంచి ఎలా బయటపడ్డాయో ప్రస్తుత సంక్షోభాన్నీ అలానే అధిగమిస్తామన్న నమ్మకం నాకుంది" అని మోదీ పేర్కొన్నారు. మరోవైపు ఎల్పీజీకి డిమాండ్ పెరుగుతున్న నేపథ్యంలో కేంద్ర పెట్రోలియం, సహజ వనరుల మంత్రిత్వశాఖ ప్రత్యామ్నాయ ఇంధనాలపై దృష్టి సారించింది. వంట ఇంధనం కోసం రెగ్యులర్ కోటా కింద విడుదల చేసే కిరోసిన్‌కు అదనంగా మరో 48 వేల కిలో లీటర్లను రాష్ట్రాలకు కేటాయిస్తున్నట్లు గురువారం ప్రకటించింది. రాష్ట్ర ప్రభుత్వం గుర్తించిన లబ్ధిదారులకు మరిన్ని వాణిజ్య ఎల్పీజీ సిలిండర్లు కూడా విడుదల చేస్తామని ఆ శాఖ సంయుక్త కార్యదర్శి సుజాత శర్మ తెలిపారు. ఆతిథ్య, రెస్టారెంట్ రంగాల్లో బయోమాస్, బొగ్గు తదితర ప్రత్యామ్నాయ ఇంధనాలను వినియోగించుకొనేందుకు ఓ నెల రోజులు పాటు అనుమతి ఇవ్వాలని పర్యావరణ సంస్థలను కోరినట్లు ఆమె తెలిపారు. గ్రామీణ వినియోగదారుల ఎల్పీజీ బుకింగ్ గడువును ప్రస్తుతమున్న 25 రోజుల నుంచి 45 రోజులకు పెంచుతున్నట్లు పేర్కొన్నారు. అంతకుముందు పార్లమెంటులో పెట్రోలియం శాఖ మంత్రి హర్‌దీప్‌సింగ్ పురీ మాట్లాడుతూ.. 33 కోట్ల కుటుంబాల వంటగదుల్లో గ్యాస్‌కు ఎలాంటి కొరత రాకుండా చూడటం ప్రభుత్వ ప్రథమ ప్రాధాన్యమని చెప్పారు. దేశీయ సరఫరాకు పూర్తిరక్షణ కల్పించామని, సరఫరా చక్రంలో ఏ మార్పూ చేయలేదని తెలిపారు. చరిత్రలో ఎన్నడూ లేనంత అవాంతరాలు ఎదురైన తరుణంలో ఎల్పీజీ ఉత్పత్తిని 28% పెంచామని చెప్పారు. మన ముడిచమురు అవసరాల్లో 45% గతంలో హర్మూజ్ జలసంధి ద్వారా దిగుమతి అయ్యేదని, ఇప్పుడు ఇతర మార్గాల్లో 70% తెచ్చుకుంటున్నామని వివరించారు. చమురుశుద్ధి కర్మాగారాలు పూర్తిసామర్థ్యంతో పనిచేస్తున్నాయని చెప్పారు. బుక్ చేసిన రెండున్నర రోజుల్లో ఇళ్లకు ఎల్పీజీ సిలిండర్లు వస్తున్నాయని స్పష్టంచేశారు. వాణిజ్య ఎల్పీజీపై ఎలాంటి నియంత్రణా లేదన్నారు. ఎంత కావాలంటే అంత తీసుకోవచ్చని చెప్పారు. ప్రపంచ పరిణామాల ప్రభావం గ్యాస్ ధరలపై పడకుండా అన్ని చర్యలు తీసుకున్నట్లు వివరించారు.

**బారులు తీరిన వినియోగదారులు**

దేశంలో ఇంధన కొరత లేదని కేంద్ర ప్రభుత్వం గురువారం పార్లమెంటులో ప్రకటించినా దేశవ్యాప్తంగా గ్యాస్ ఏజెన్సీ కార్యాలయాలు, పెట్రోల్ పంపుల బయట ప్రజలు భారీ సంఖ్యలో బారులు తీరారు. మరోవైపు వంట గ్యాస్ సిలిండర్ల కొరత.. పలు రాష్ట్రాల్లో పాఠశాల విద్యార్థుల మధ్యాహ్న భోజన పథకంపైనా ప్రభావం చూపుతోంది. పశ్చిమ బెంగాల్‌లో కొన్ని పాఠశాలల్లో కట్టెలపైనే వంటలు వండుతున్నారు. ఎల్పీజీ కొరతతో కొన్ని హోటళ్లు, రెస్టారెంటులు తాత్కాలికంగా తమ కార్యకలాపాలను మూసివేశాయి. వాణిజ్య గ్యాస్ సిలిండర్ల కేటాయింపుల్లో ఆసుపత్రులు, విద్యాసంస్థలకు ప్రాధాన్యం ఇస్తామని ఉత్తరాఖండ్ ప్రభుత్వం ప్రకటించింది. ఎల్పీజీ, ఇతర ఇంధనాల కొరత ఉందని వదంతులు వ్యాప్తి చేస్తే తీవ్ర చర్యలు తీసుకుంటామని అస్సాం ప్రభుత్వం హెచ్చరికలు జారీ చేసింది. శాంతి భద్రతల సమస్యలు తలెత్తుతాయన్న భయంతో గ్యాస్ ఏజెన్సీల దగ్గర పోలీసు సిబ్బందిని నియమించాలని దిల్లీ యంత్రాంగం నిర్ణయించింది. సిలిండర్లు బుక్ చేసుకుంటున్న వారి సంఖ్య పెరగడంతో చమురు మార్కెటింగ్ సంస్థల సర్వర్లు క్రాష్ అవుతున్నాయని కొందరు డిస్ట్రిబ్యూటర్లు పేర్కొంటున్నారు. ఎల్పీజీ కొరతతో ఇండక్షన్ స్టవ్‌లకు డిమాండ్ పెరిగింది. వీటి అమ్మకాలు 75 నుంచి 80 శాతం పెరిగాయని వ్యాపార వర్గాలు పేర్కొంటున్నాయి.

# పర్యాటక రంగంలో పెట్టుబడుల పై సిఎం కీలక సమీక్ష

-మొదటిపేజీ తరువాయి

.దేవాలయాలు పవిత్ర మైన ఆధ్యాత్మిక క్షేత్రాలతో పాటు, మానసిక ఉల్లాసాన్ని కలిగించే ప్రాంతాలు వాటిని అభివృద్ధి చేయాలన్నారు. పాపి కొండలు, గండికోట భారత్ కే గ్రాండ్ కాన్యన్, సూర్యలంక మరో గోవాగా తయారవుతుందన్నారు.జిల్లాల వారీగా ఆయా ప్రాంతాల్లో ఉన్న పర్యాటక కేంద్రాలను అభివృద్ధి చేయాలి.టూరిజం ఎక్స్ పీరియన్స్ సెంటర్లను ఏర్పాటు చేయటంతో పాటు మాన్యుమెంట్లను కూడా అభివృద్ధి చేయాలి. తిమ్మమ్మ మర్రిమాను వద్ద మౌలిక సదుపాయాలు కల్పిస్తే మంచి పర్యాటక ప్రాంతంగా మారుతుందన్నారు. కంభం చెరువు ఆసియా లోనే అతిపెద్ద మానవ నిర్మిత నీటి వనరు. పర్యాటకంలో పెద్ద ఎత్తున పెట్టు బడులు వచ్చే అవకాశం ఉంది.అందుకే పర్యాటకానికి పారిశ్రామిక హోదాను కల్పించాం. అమరావతిలో క్రియేటివ్ సిటీ ఏర్పాటు చేస్తాం. అమరావతిలో కంటెంట్ క్రియేషన్ చేసే వారిని ప్రోత్సహిస్తాం. ఏఐ, ఫిలిం, కంటెంట్ క్రియేషన్ పరిశ్రమలకు పెద్ద పీట వేస్తాం అన్నారు. రాష్ట్రంలో క్రియేటివ్ ఎకానమీ పెరిగేందుకు వీలుగా ప్రత్యేక చర్యలు చేపడుతున్నాం అని ముఖ్యమంత్రి సమావేశంలో ప్రకటించారు.

# యుద్ధజ్వాలలు దాటి..

-మొదటిపేజీ తరువాయి

ఒక నౌక అత్యంత వ్యూహాత్మకంగా బుధవారం నాటికి ముంబయికి చేరుకుంది. మరొకటి రెండ్రోజుల్లో భారత్‌కు చేరుకోనుంది. ఈ రెండింటి ద్వారా 3 మిలియన్ బ్యారెళ్ల చమురు అందుబాటులోకి రానుంది. లైబీరియా జెండాతో ఉన్న షెన్‌లాంగ్ అనే భారీ చమురు ట్యాంకర్ సౌదీ అరేబియాలోని రస్ తనూరా పోర్టులో ఈ నెల 1వ తేదీన చమురును నింపుకొంది. అప్పటికి పశ్చిమాసియా యుద్ధం ప్రారంభమై ఒక రోజే అయింది. యుద్ధం తీవ్రమైన 3వ తేదీన అది అక్కడి నుంచి బయలుదేరింది. ఈ నౌకలో మిలియన్ బ్యారెల్ (1,35,335 టన్నులు) చమురు ఉంది. అప్పటికే ఇజ్రాయెల్, గల్ఫ్ దేశాలతోపాటు హర్మూజ్ జలసంధిపై ఇరాన్ దాడులు ప్రారంభించింది. ఈ నెల 9వ తేదీ నాటికి అది హర్మూజ్ జలసంధి వద్దకు చేరుకుంది. అక్కడే దాని కెప్టెన్ అయిన సుశాంత్ సింగ్ సంధు, సిబ్బంది వ్యూహాత్మకంగా

వ్యవహరించారు. నౌక ప్రయాణాన్ని ఎవరూ ట్రాక్ చేయకుండా ఆటోమేటిక్ ఐడెంటిఫికేషన్ సిస్టమ్, ట్రాన్స్‌పాండర్లను స్విచ్ఛాఫ్ చేశారు. జల సంధిని దాటి భారత్ దిశగా ప్రయాణిస్తున్నప్పుడు.. మళ్లీ ట్రాకింగ్ సిస్టమ్స్‌లో ఈ నౌక కనిపించింది. సంక్షోభ సమయాల్లో ప్రత్యర్థులకు చిక్కకుండా ఉండేందుకు అసాధారణ పరిస్థితుల్లో

షిప్పింగ్ కంపెనీలు ఈ టెక్నిక్‌ను వాడుతుంటాయి. దీనిని గోయింగ్ డార్క్‌గా చెబుతుంటారు. బుధవారం ఎట్టకేలకు నౌక ముంబయి పోర్టుకు చేరుకుంది. నౌకలోని 29 మంది సిబ్బందిలో భారతీయులతో సహా పాకిస్థాన్, ఫిలిప్పీన్స్ జాతీయులున్నారు.

భారతీయ జెండాతో ఉన్న వీఎల్‌సీసీ అనే మరో భారీ నౌక 2 మిలియన్ బ్యారెళ్ల చమురుతో ఇరాక్ నుంచి బయలుదేరి గురువారానికి భారత జలాల్లోకి ప్రవేశించింది. అది రెండ్రోజుల్లో ఒడిశాలోని పారాదీప్ పోర్టుకు చేరుకోనుంది.

# ఏపీ రైతులకు ఉగాది కానుక...
# నేడు అన్నదాత సుఖీభవ 3.0 సాయం

-మొదటిపేజీ తరువాయి

ఒక్కో రైతు అకౌంట్‌లో రూ. 6,000 జమ చేయనుంది. మూడో విడతగా రూ. 2,676 కోట్లను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఖర్చు చేస్తున్నాయి. ఇందులో రాష్ట్ర వాటా రూ. 1,874 కోట్లు. ఇప్పటికే రెండు విడతల కలిపి రూ. 14 వేలను ప్రభుత్వం అందించింది. శుక్రవారం ఇచ్చే రూ. 6 వేలతో కలిపి రైతులకు ఇచ్చిన హామీ ఏడాదికి రూ. 20 వేల సాయం పూర్తవుతుంది.

**ఏడాదిలో రూ. 8,985 కోట్ల సాయం**

ఒక్కో రైతు కుటుంబానికి రూ. 20 వేల ఆర్థిక సాయాన్ని అందిస్తామని కూటమి ఎన్నికల వేళ సూపర్ -6 హామీల్లో పేర్కొంది. కేంద్రం పీఎం కిసాన్ కింద రూ. 6,000, రాష్ట్ర ప్రభుత్వం రూ. 14,000 కలిపి మూడు విడతల్లో ప్రతీ రైతు కుటుంబానికి ఏడాదికి రూ. 20 వేలు ఇస్తామని హామీ ఇచ్చింది. ఈ మేరకు 2025 ఆగస్ట్ 2న మొదటి విడతగా రూ. 7 వేల చొప్పున రూ. 3,174 కోట్లు, నవంబర్ 19న రెండవ విడతగా రూ. 7 వేల చొప్పున రూ. 3,135 కోట్లు కలిపి రూ. 6,309 కోట్లు రైతులకు అందించింది. రేపు మూడో విడతలో రూ. 6 వేల చొప్పున 46.85 లక్షల మందికి రూ. 2,676 కోట్లు ఇవ్వనుంది. ఒక్క ఏడాదిలోనే రైతు సోదరులకు కూటమి ప్రభుత్వం రూ. 8,985 కోట్లు అందించినట్లు అవుతుంది. ఇందులో రాష్ట్ర వాటా రూ. 6,560 కోట్లు కాగా, కేంద్రం వాటా రూ. 2,425 కోట్లు.

**సూరంపల్లి నుంచి నిధులు విడుదల చేయనున్న సీఎం**

అన్నదాత సుఖీభవ 3.0 నిధులు విడుదల కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు పాల్గొననున్నారు. కృష్ణాజిల్లా, గన్నవరం నియోజకవర్గం, సూరంపల్లిలో శుక్రవారం అన్నదాత సుఖీభవ కార్యక్రమంలో పాల్గొంటారు. సాయంత్రం 4.20 గంటలకు సీఎం సూరంపల్లికి చేరుకుంటారు. 4.25 గంటల నుంచి 4.55 గంటల వరకు రైతు సోదరులతో ముఖాముఖి అవుతారు. 5.00 గంటలకు ప్రజావేదిక సభలో పాల్గొని ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రసంగిస్తారు.

# పెట్టుబడులు గురించి ఆలోచించినట్టే పేదల గురించీ ఆలోచించాలని సీఎం

-మొదటిపేజీ తరువాయి

అమలుకు సంబంధించి ఓ లేఖను లబ్దిదారులకు అందించేలా చర్యలు తీసుకోండి అని సూచించారు. ప్రతీ లబ్దిదారుకూ ప్రతీ నెలా ఏం లబ్ది కలిగిందో తెలిసేలా చేయండి. ఏ కుటుంబానికి ఏం లబ్ది కలిగిందో తెలిస్తే అంతా పారదర్శకంగా ఉంటుంది.ప్రభుత్వం అందించే పెన్షన్, ఉచిత సిలెండర్, తల్లికి వందనం, ఫీజు రీఎంబర్సుమెంట్ లాంటివి లబ్దిదారులకు తెలియాలి అన్నారు. దీపం 2.0 పథకానికి డిజిటల్ ఓచర్ జారీ చేసే అంశాన్ని పరిశీలించాలి. డీబీటీ పథకాల్లో ప్రోగ్రామబుల్ వోచర్లను లబ్దిదారులకు ఇస్తే వారు వినియోగించు కుంటారన్నారు. మార్చి 9 నాటికి 50.45 కోట్ల ప్రయాణాలను మహిళలు చేశారు. రూ. 1,775 కోట్లను ప్రభుత్వం ఆర్టీసీకి రీఎంబర్సు చేసింది. డ్వాక్రా, మెప్మా సంఘాల సేవల్ని వినియోగించుకుని పీ4 సహా జీరో పావర్టీ కార్యక్రమాన్ని సమర్ధవంతంగా చేపట్టాలి. కుటుంబ సాధికారిత సాధించేలా చర్యలు తీసుకోవాలి. సంపద సృష్టితో పాటు ప్రజలకు మెరుగైన జీవన ప్రమాణాలు అందేలా చూడాలి. సంక్షేమ పథకాల అమలుకు సంబంధించి క్యాలెండర్ విడుదల చేస్తాం. అన్నదాత సుఖీభవ ద్వారా రేపు మూడో విడత నిధులు విడుదల చేస్తున్నాం. అన్నా క్యాంటీన్ల ద్వారా 7.5 కోట్ల భోజనాలు ఇప్పటి వరకూ పేదలకు అందించగలిగాం. అంగన్ వాడీ, ఆశాలకు గ్రాట్యూటీ అమలు చేస్తున్నాం. రూ. వెయ్యి కోట్లతో రోడ్ల మరమ్మత్తులు చేపట్టాం. పల్లె పండుగ కింద గ్రామీణ ప్రాంతాల్లో రూ. 4 వేల కోట్ల వ్యయం చేశాం. సంక్షేమ పథకాలు లాస్ట్ మైల్ డెలివరికి చేరడమనేది లక్ష్యంగా కలెక్టర్లు పనిచేయాలి. సంక్షేమం, అభివృద్ధి సమతూకంగా జిల్లా కలెక్టర్లు పనిచేయాలి. ప్రతీ ఒక్కరికీ ఇంటి స్థలం లేదా ఇంటిని మంజూరు చేసేలా చర్యలు.ఉగాదికి 2.50 లక్షల మందికి సామూహిక గృహప్రవేశాల కార్యక్రమాన్ని నిర్వహిస్తాం.ప్రతీ ఇంటికీ జేజేఎం కింద తాగునీటి కుళాయి ఇస్తాం, ప్రతి ఇంటికి ఇంటర్నెట్ అందేలా చర్యలు తీసుకుంటాం. సాలిడ్, లిక్విడ్ మేనేజ్మెంట్ ద్వారా గ్రామాలు పరిశుభ్రంగా ఉంచాలి. నెట్ జీరో కాన్సెప్టుగా ఘన వ్యర్థాలను వేస్ట్ టూ ఎనర్జీ ప్లాంట్లకు తరలించాల. తడి వ్యర్థాలను కాంపోస్టు తయారు చేసేందుకు మళ్లించాలి. 500 పాఠశాలల్లో నెట్ జీరో కాన్సెప్టులో కిచెన్ గార్డెన్, బయోడైవర్సిటీలో భాగస్వాములను చేయాలి. వీ బీజీ రామ్ జీ కింద రూ. 9773 కోట్లు ఏపీకి కేటాయించారు. ఇప్పుడు ఈ పథకం డిమాండ్ డ్రివెన్ కాదు, దీనికి అనుగుణంగా పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి. పెట్టుడులు గురించి ఎలా ఆలోచిస్తున్నామో, పేదలకు అందించే సంక్షేమం గురించి, వారికి కల్పించే సాధికారత గురించీ కలెక్టర్లు ఆలోచించాలి.

# ప్రతీకారం తీర్చుకుంటాం - ఇరాన్ కొత్త సుప్రీం లీడర్

-మొదటిపేజీ తరువాయి

తొలిసారి స్పందించారు. శత్రువులపై ఒత్తిడి తీసుకొచ్చేందుకు హర్మూజ్ జలసంధి మూసివేత కొనసాగుతుందన్నారు. పొరుగున ఉన్న గల్ఫ్ దేశాల్లోని అమెరికా స్థావరాలపై దాడులు కొనసాగుతాయని, వాటిని తక్షణమే మూసివేయాలని హెచ్చరించారు. మినాబ్ పాఠశాలపై దాడి సహా ఆయా ఘటనలపై ప్రతీకారం తీర్చుకుంటామని స్పష్టం చేశారు. ఈ మేరకు సుప్రీం లీడర్ ప్రకటనను అధికారిక మీడియాలో ప్రసారం చేశారు. అయితే, యుద్ధం ప్రారంభంలో మొజ్తాబా ఖమేనీ గాయపడినట్లు ఇజ్రాయెల్ నిఘా వర్గాలు అంచనా వేస్తున్నాయి.పొరుగు దేశాలతో స్నేహాన్ని ఇరాన్ విశ్వసిస్తుందని.. అయినప్పటికీ అక్కడి అమెరికా స్థావరాలపై మాత్రం దాడులను కొనసాగుతాయని మొజ్తాబా ఖమేనీ అన్నారు. కష్ట సమయంలో తమ సైనికులు ధైర్యంగా పోరాడుతున్నారంటూ ప్రశంసించారు. పొరుగు దేశాలతో సంబంధాలు మెరుగుపరచుకోవాలని తాము కోరుకుంటున్నామన్నారు. దాడుల్లో గాయపడిన వారికి ఉచితంగా చికిత్స అందించడంతో పాటు బాధిత కుటుంబాలను ఆర్థికంగానూ ఆదుకుంటామని భరోసా ఇచ్చారు.

# పెట్టుబడుల కోసం భూకేటాయింపులు సబబే: వైసీపీ ఎంపీ పిల్‌పై హైకోర్టు కీలక వ్యాఖ్యలు

తక్కువ ధరకు కంపెనీలకు భూములు కేటాయిస్తున్నారంటూ ఎంపీ గురుమూర్తి పిల్

రాయితీలు, భూ కేటాయింపుల్లో ప్రోత్సాహకాలు లేకపోతే కంపెనీలు ఎలా వస్తాయన్న హైకోర్టు

మార్కెట్ ధరకు భూమిలిస్తే కంపెనీలు ఇతర ప్రాంతాలకు వెళతాయని వ్యాఖ్య




ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి కోసం కూటమి ప్రభుత్వం అనుసరిస్తున్న పారిశ్రామిక విధానంపై రాష్ట్ర హైకోర్టు సానుకూల ధోరణి వ్యక్తం చేసింది. తక్కువ ధరకు భూములను కేటాయిస్తున్నారంటూ వైసీపీ ఎంపీ గురుమూర్తి దాఖలు చేసిన ప్రజా ప్రయోజన వ్యాజ్యం (PIL)పై విచారణ చేపట్టిన ధర్మాసనం, రాష్ట్ర ప్రయోజనాల దృష్ట్యా కీలక వ్యాఖ్యలు చేసింది.రాష్ట్ర విభజన తర్వాత ఆంధ్రప్రదేశ్ ప్రధానంగా వ్యవసాయ ఆధారిత రాష్ట్రంగా మిగిలిపోయిందని ధర్మాసనం గుర్తుచేసింది. రాష్ట్రం ఆర్థికంగా బలోపేతం కావాలంటే భారీ స్థాయిలో పారిశ్రామికీకరణ జరగడం తప్పనిసరి అని స్పష్టం చేసింది. కంపెనీలకు రాయితీలు, భూమి కేటాయింపుల్లో ప్రోత్సాహకాలు ఇవ్వకుండా పెట్టుబడులు ఎలా వస్తాయని కోర్టు ప్రశ్నించింది. మార్కెట్ ధరకే భూమిలిస్తే, కంపెనీలు తమకు అనుకూలమైన ఇతర ప్రాంతాలకు వెళ్లే ప్రమాదం ఉందని హెచ్చరించింది.భూకేటాయింపులను కేవలం ఒక అంశంగా చూడకూడదని, వాటి ద్వారా రానున్న రోజుల్లో వచ్చే ఉపాధి, అభివృద్ధిని పరిగణనలోకి తీసుకోవాలని సూచించింది. ప్రస్తుత ప్రభుత్వ పాలసీలతో మరో 200 ఏళ్ల పాటు రాష్ట్రానికి ప్రయోజనం ఉంటుందని అభిప్రాయపడింది. ప్రభుత్వ విధానాల వల్ల పెట్టుబడులు పెట్టలేకపోతున్నామని ఏ కంపెనీ కోర్టుకు రాలేదని, కేవలం ఒక రాజకీయ నేత మాత్రమే ఈ విధానాన్ని సవాల్ చేస్తూ కోర్టుకు వచ్చారని ధర్మాసనం వ్యాఖ్యానించింది. వేలం ద్వారా భూమిలిస్తే ఆశించిన ఫలితాలు రాకపోవచ్చని కోర్టు అంచనా వేసింది. హైకోర్టు వ్యాఖ్యలతో పారిశ్రామికవేత్తలకు భూముల కేటాయింపు విషయంలో ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలకు న్యాయపరంగా బలమైన మద్దతు లభించినట్లయింది.

# అభివృద్ధికి, మౌలిక సదుపాయల కల్పనకు అటవీ శాఖ సహకరించాలి.





- గిరిజన ప్రాంతాల్లో కూడా మౌలిక సదుపాయాలు కల్పించకపోతే ఎలా..?.
- అటవీ శాఖ పనితీరు పీపుల్స్ ఫ్రెండ్లీగా మారాలి.
- రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ ద్వారా పెద్ద ఎత్తున ఆవిష్కరణలు రావాలి.
- ఏఐ సాయంతో వైద్య ఖర్చులు తగ్గించేలా చర్యలు.
- వేసవిలో వడగాలుల మరణాలు ఉండకూడదు.
- 6 వ జిల్లా కలెక్టర్ల రెండో రోజు సమావేశంలో సీఎం చంద్రబాబు

**అమరావతి, పెన్ సత్తా, మార్చి 12:** ప్రభుత్వం లోని అన్ని విభాగాలు ప్రజా కోణం లోనే ఆలోచించి నిర్ణయాలు తీసుకోవాలని, జరుగుతోన్న ప్రగతికి సహకరించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సూచించారు. ముఖ్యంగా అటవీ శాఖ పనితీరు పీపుల్స్ ఫ్రెండ్లీగా మరింతగా మారాల్సిన అవసరం ఉందని సీఎం చంద్రబాబు అభిప్రాయపడ్డారు. ఇక జూనియర్ ఐఏఎస్‌లకు హ్యాండ్ హోల్డింగ్ ఇచ్చేలా సీనియర్లు సహకరించాలని దిశా నిర్దేశం చేశారు. గురువారం రాష్ట్ర సచివాలయంలో 6 వ జిల్లా కలెక్టర్ల కాన్ఫరెన్స్ రెండో రోజున వివిధ అంశాల పై సీఎం సమీక్షించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ ఏఐ సాయంతో వైద్య పరీక్షలు నిర్వహించే వ్యవస్థలను అందుబాటు లోకి తీసుకురావటం అభినందనీయం. తక్కువ వ్యయంతో పోర్టబుల్ గా ఉండేలా మెడ్ టెక్ టూల్స్ తయారు చేయాలి. ఆర్టీఐహెచ్ ద్వారా మరిన్ని ఆవిష్కరణల్ని చేసి ప్రజారోగ్యం కోసం వినియోగిద్దాం. రూట్, రోడ్ ఆప్టిమైజేషన్ కూడా చేసుకుని 108 అంబులెన్సులు త్వరితగతిన చేరుకునేలా చూడాలి. మారుమూల ప్రాంతాల్లో ఉండే వ్యక్తులను కూడా అతి తక్కువ టైమ్ లో 108 చేరుకోవాలి. ఈసారి వేసవి ప్రభావం ఎక్కువ ఉంటుందని అంచనాలు ఉన్నాయి. వడగాలుల ప్రభావం పై ముందుగానే ప్రచారం చేపట్టాలి. వేసవిలో ప్రజలు సురక్షితంగా ఉండేలా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలి. పశువులకు నీటి తొట్టెలను పెద్ద ఎత్తున నిర్మించాం, ఆ తొట్టెల్లో నీళ్లు నింపేలా చర్యలు తీసుకోవాలి. కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాల నిధుల నుంచి పశు భీమా పథకాన్ని కూడా సమర్ధంగా అమలు చేయాలి. ఎండలో పని చేసే ఉపాధి హామీ కూలీలకు సంబంధించి జాగ్రత్తలు తీసుకోవాలి. వడగాలుల వల్ల ఒక్క మరణం కూడా జరగడానికి వీల్లేదు అని సీఎం చంద్రబాబు ఆదేశించారు.

అభివృద్ధికి అటవీ శాఖ ఆటంకంగా మారకూడదు: అభివృద్ధికి, మౌలిక సదుపాయల కల్పనకు అటవీ శాఖ సహకరించాలి. నాలుగోసారి సీఎంగా చేస్తున్నాను కానీ గతంలో ఎన్నడూ లేని విధంగా ఈ సారి అటవీ శాఖ విషయంలో చాలా ఫిర్యాదులు వస్తున్నాయి. దీని పై ఇప్పటికే డిప్యూటీ సీఎంతో మాట్లాడాను, మళ్లీ మరోసారి మాట్లడతాను. పోలీసు డిపార్ట్మెంట్ పీపుల్ ఫ్రెండ్లీగా మారిపోయింది, కానీ ఫారెస్టు డిపార్టు మెంట్ పీపుల్ ఫ్రెండ్లీగా లేరు. మారాల్సిన అవసరం ఉంది. అటవీ శాఖ గ్రీన్ కవర్ పెంచే అంశం పై దృష్టి పెట్టాలి, బయోడైవర్సిటీకి వెళ్లాలి, ప్రజలు ఆహ్లాదంగా పర్యటించేందుకు ఉపయుక్తంగా పరిస్థితులు మారాలన్నారు. ఫారెస్టు అధికారులు జిల్లా కలెక్టర్ కిందే పనిచేయాలని గుర్తుంచు కోవాలి, కలెక్టర్లు చెబుతున్నా అటవీ అధికారులు పట్టించుకోవడం లేదని ఫిర్యాదులు వస్తున్నాయి. నిబంధనలకు అనుగుణంగానే పర్యావరణహిత ప్రాజెక్టులకు సహకరించాలి. సర్వే చేస్తున్న సమయంలో ప్రైవేటు, అటవీ, ఎండోమెంట్ తదితర క్లాసిఫికేషన్ల ప్రకారం రిజర్వు ల్యాండ్ గుర్తించాలి. కొందరు అటవీ శాఖ అధికారుల ఇంప్రాక్టికల్ థింకింగ్ వల్ల ఇబ్బందులు వస్తున్నాయి.



గిరిజన ప్రాంతాల్లో కూడా మౌలిక సదుపాయాలు కల్పించకపోతే ఎలా..?, నడకదారిన శ్రీశైలం వస్తున్న భక్తులను అటవీ శాఖ అధికారులు అడ్డుకున్నారు. ఆ తర్వాత రోజే తొక్కిసలాట అయ్యే పరిస్థితి వచ్చింది. బద్వేలులోనూ అటవీ శాఖ ఇదే తరహాలో వ్యవహరించింది. ఏమైనా ఇబ్బందులుంటే ప్రభుత్వం దృష్టికి తీసుకురావాలి. ప్రజలను ఇబ్బంది పెట్టేలా, కార్యక్రమాలకు ఆటంకం కలిగేలా వ్యవహరించకూడదు. రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ ద్వారా వినూత్న ఆలోచనలు చేయాలి. స్టార్టప్ కంపెనీలు, యువతలో ఉన్న ఇన్నోవేషన్లను ప్రొత్సహించేందుకు ఆర్టీఐహెచ్(రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్) అధికారులు పని చేయాలి. ఆర్టీఐహెచ్‌ను మరింత యాక్టీవ్ చేయాల్సిన అవసరం ఉంది. వినూత్నంగా ఆలోచిస్తారు కాబట్టే ఆర్టీఐహెచ్ కు యువ అధికారులను నియమించాం. యువ అధికారులకు సీనియర్లు సహకరించాలి, వారికి హ్యాండ్ హోల్డింగ్ అందించాలి అని సీఎం చంద్రబాబు ఆదేశించారు. ఈ సమావేశంలో మంత్రులు, వివిధ శాఖల ఉన్నతాధికారులు, జిల్లా కలెక్టర్లు పాల్గొన్నారు.

# స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ విషయంలో కలెక్టర్ల మధ్య పోటీ పెట్టాలి.



- రాష్ట్రంలో పెట్టుబడి ప్రతిపాదనల పై సీఎం చంద్రబాబు సమీక్ష.
- పెట్టుబడుల పై జిల్లా కలెక్టర్లకు దిశా నిర్దేశం చేసిన ముఖ్యమంత్రి.

**అమరావతి,పెన్ సత్తా, మార్చి 12** రాజధానిలో జరుగుతున్న కలెక్టర్ల సమావేశం రెండో రోజు ముఖ్య మంత్రి చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ విషయంలో జిల్లా కలెక్టర్ల మధ్య పోటీ పెట్టాలని సూచన చేసారు. పెట్టు బడులు రాబట్టడం, వాటిని గ్రౌండ్ అయ్యేలా చూడడంలో కలెక్టర్లు ప్రోయాక్టీవ్ గా ఉండాలని సీఎం ఆదేసించారు. జిల్లాల్లో ఉన్న అవకాశాలు, అనుకూలతల ఆధారంగా పెట్టుబడులు సహా వివిధ రంగాలను ప్రొత్సహించేలా కలెక్టర్లు ప్రణాళికలు సిద్దం చేయాలన్న ముఖ్యమంత్రి. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ రాష్ట్రానికి వచ్చిన పెట్టు బడులను వేగంగా గ్రౌండ్ అయ్యేలా చర్యలు చేపట్టాలి. పెట్టు బడులను ఆకర్షించేలా జిల్లా కలెక్టర్లు ఎప్పటికప్పుడు చర్యలు తీసుకోవాలి. పెట్టు బడులు వస్తే స్థానికంగా యువతకు ఉపాధి, ప్రజల తలసరి ఆదాయం పెరుగుతాయి.

విశాఖ, అమరావతి, తిరుపతి ఎకనామిక్ రీజియన్ డెవలప్మెంట్ ప్రాంతాలుగా అభివృద్ధి చేస్తున్నాం. విశాఖ రీజియన్ కు పరిశ్రమల శాఖ కార్యదర్శి యువరాజ్, అమరావతికి పురపాలక శాఖ ముఖ్య కార్యదర్శి సురేష్, తిరుపతి రీజియన్ కు ముఖేష్ కుమార్ మీనా బాధ్యత వహిస్తారు. రీజియన్ల వారీగా పరిశ్రమలు, పెట్టుబడులు, ఆయా ప్రాంతాల ఆర్ధికాభివృద్ధి బాధ్యతను ఈ అధికారులు తీసుకుంటారు. పెట్టు బడుల పై ఎప్పటి కప్పుడు కలెక్టర్లు సమీక్షించి ప్రాజెక్టులు గ్రౌండ్ అయ్యేందుకు తక్షణం చర్యలు చేపట్టాలి.

అనుమతులు వేగంగా ఇవ్వటంతో పాటు భూ కేటాయింపులు కూడా యుద్ధ ప్రాతిపదికన జరిగేలా చూడాలి. పరిశ్రమలకు నీటిని ఇస్తేనే వేగంగా ఉత్పాదన ప్రారంభిస్తారు. ఓర్వకల్లులో పారిశ్రామిక క్లస్టర్ రూపకల్పన చేశాం, ఇప్పుడు ఎయిర్ పోర్టు లాంటి మౌలిక సదుపాయాలు కూడా వచ్చాయన్నారు.

ఇప్పుడు భవిష్యత్తులో ఓ మేజర్ పారిశ్రామిక హబ్ గా మారుతుంది.

కడప జిల్లాలో కొప్పర్తి కూడా ఆ పారిశ్రామిక క్లస్టర్ గా తయారు కావాలన్నారు. జిల్లాల్లో పెట్టు బడులు మీటింగులు పెట్టాలి, పెట్టు బడులు రాబట్టేందుకు కలెక్టర్లు చొరవ తీసుకోవాలి. స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్సులో జిల్లాల వారీగా ర్యాంకులిస్తాం. 2019-24లో రాష్ట్రానికి పెట్టు బడులు పెట్టడానికి ఎవ్వరూ ముందుకు రాలేదు. అమర్ రాజా కంపెనీ తిరుపతిలో కార్పోరేట్ ఆఫీస్ పెట్టింది, వారినీ గత పాలకులు పారిపోయేలా చేశారు. 2014-19 లో పరిశ్రమలకు ఇచ్చిన భూములను గత ప్రభుత్వం వేరే అవసరాలకు వాడేసింది. ఉమ్మడి రాష్ట్రంగా ఉన్నప్పుడు ఏపీని బెంగళూరుకు పోటీగా తీర్చిదిద్దాం. మోస్ట్ లివబుల్ సిటీగా హైదరాబాద్ ను తీర్చిదిద్దాం, ఎకో సిస్టం కల్పించాం, ఇప్పుడు ఆ ఫలితాలు హైదరాబాద్ అనుభవిస్తోందన్నారు. ఇప్పుడు రాష్ట్రం మొత్తం అదే తరహా ఎకో సిస్టం ఏర్పాటు చేస్తున్నాం. ఏదైనా జిల్లాల్లో పరిశ్రమలు రాకుంటే ఆ జిల్లాల్లో టూరిజం ప్రమోట్ చేయాలి, లేదా ఐటీని ప్రమోట్ చేయాలి, ఎంఎస్ఎంఈలు ప్రమోట్ చేయాలి, అగ్రికల్చర్ ప్రమోట్ చేయాలన్నారు.

ఇలా ఏదోక రంగంలో ఆయా జిల్లాలకున్న ప్రత్యేకతలను దృష్టిలో పెట్టుకుని, అనుకూలతలను దృష్టిలో పెట్టుకుని ఆయా రంగాల్లో అభివృద్ధి చేయాలన్నారు. ఆయా జిల్లాలకున్న అడ్వాంటేజీలను ప్రమోట్ చేయాలి, పెట్టు బడులను ఆకర్షించాలన్నారు. అందరూ తమ దగ్గరకే రావాలని జిల్లా కలెక్టర్లు, మంత్రులు అనుకోకూడదు.

# ఘనంగా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ 16 వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

**కాకినాడ, పెన్ సత్తా, మార్చి 12:**మాజీ శాసనసభ్యులు జ్యోతుల చంటి బాబు ఆధ్వర్యంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ 16 వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు.

కాకినాడ జిల్లా, జగ్గంపేట నియోజకవర్గం, జగ్గంపేట గ్రామంలో మాజీ శాసనసభ్యులు, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ సి ఈ సి మెంబర్ జ్యోతుల చంటి బాబు ఆధ్వర్యంలో వారి కార్యాలయంలో గురువారం ఉదయం నాయకులు, కార్యకర్తలు సమక్షంలో ఘనంగా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ 16 వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా జ్యోతుల చంటి బాబు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జ్యోతులు చంటి బాబు మాట్లాడుతూ ప్రజల మెప్పుతో కూడిన పార్టీ ప్రజల కోసం నిలబడిన పార్టీగా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నిలబడిందని, అనేక సంక్షేమ కార్యక్రమాలకు పునాదిగా నిలబడిందని, తమ నాయకు డైన మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్ మోహన రెడ్డి ఆలోచన విధానాలను పొందుపరిచే విధంగా ఈ పార్టీ నిలబడిందని అన్నారు. తండ్రి మార్గంలో నడిచే తనయుడిగా ఈ పార్టీని ముందుకు నడిపిస్తూ తెలుగు రాష్ట్రాలలో ఘన విజయాన్ని సాధించిన పార్టీగా నిలబడిందన్నారు. ఇటు వంటి పార్టీ 16 వ ఆవిర్భవ దినోత్సవ కార్యక్రమాలు జగ్గంపేట నియోజకవర్గం లో మేము చేసుకోవడం నాకు చాలా ఆనందకరమని తెలిపారు. రానున్న రోజుల్లో పార్టీకి అండగా పార్టీ కోసం




పనిచేస్తామని తెలిపారు. కూటమి ప్రభుత్వం చేస్తున్న అసమర్ధ పాలనకు వ్యతిరేకంగా మేము శాంతియుతంగా నిరసన తెలియజేస్తామని, ఇచ్చిన హామీలను నెరవేర్చాలని వారిని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జగ్గంపేట నియోజకవర్గ కార్యకర్తలు, అభిమానులు, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# గిరిజన మిల్లెట్ ఫుడ్ మెనూను ఆవిష్కరించిన సీఎం చంద్రబాబు.

అరకు కౌని పేరుతో సాంప్రదాయ గిరిజన వంటకాలతో మిల్లెట్ మీల్ తయారీ.





**అమరావతి, పెన్ సత్తా, మార్చి 12** అరకు కౌని పేరుతో రూపొందించిన తొలి గిరిజన ఆర్గానిక్ మిల్లెట్ ఫుడ్ మెనూను ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆవిష్కరించారు. రాష్ట్ర సచివాలయంలో గురువారం జిల్లా కలెక్టర్ల సదస్సు రెండో రోజున ఏర్పాటు చేసిన ఈ ఆర్గానిక్ మిల్లెట్ ఆహార ఉత్పత్తుల స్టాల్ ను సీఎం చంద్రబాబు సందర్శించారు. గిరిజనులు పండించిన కొర్రలు, రాగులు, సామలు, కాకిజొన్నలు, గంట్ల, మొక్కజొన్న, కొండ కందులు, రాజ్మాతో చేసిన కొర్ర పాయసం, రాగి చపాతీ, సామల పులిహోర, కాంట్ల అంబలి, కార్న్ వడ, తూర్ దాల్ కర్రీ వంటి ఆహార ఉత్పత్తులను అక్కడ ప్రదర్శించారు. ఈ ఆహార ఉత్పత్తులను ముఖ్యమంత్రి చంద్రబాబు పరిశీలించి రుచి చూశారు. గిరిజనుల ఆహార సంప్రదాయాలను గౌరవిస్తూ ఆరోగ్యకర మైన మిల్లెట్ ఆహారాన్ని మరింత ప్రోత్సహించాలని సీఎం చంద్రబాబు సూచించారు. టూరిజం, ఇండియన్ కలినరీ ఇన్‌స్టిట్యూట్ కలిసి రాష్ట్రం లోని స్టార్ హోటళ్లు, ఆతిథ్య సంస్థలకు ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలు నిర్వహించనున్నాయని సీఎంకు అధికారులు తెలిపారు. ప్రముఖ హోటళ్లు, రెస్టారెంట్లలో 'అరకు కౌని' వంటకాలను వారి మెనూలో చేర్చడం ద్వారా గిరిజన మిల్లెట్ మీల్స్‌ను ప్రోత్సాహించాలన్నారు. మిల్లెట్ థాళీని పరిశీలించిన ముఖ్యమంత్రి చంద్రబాబు జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్, మంత్రి గుమ్మిడి సంధ్యారాణిని అడిగి వివరాలు తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో మంత్రులు అచ్చెన్నాయుడు, అధికారులు పాల్గొన్నారు.

# విశాఖలో మంత్రి లోకేష్ 83 వ ప్రజా దర్బార్

- వివిధ సమస్యలతో బాధపడుతున్న వారి నుంచి వినతులు స్వీకరణ.
- సమస్యల పరిష్కారం కోసం అధికారులకు ఆదేశాలు జారీ.



**విశాఖపట్నం, పెన్ సత్తా, మార్చి 12:** విశాఖపట్నం తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ 83 వ ప్రజా దర్బార్ నిర్వహించారు. తనను కలిసేందుకు పార్టీ కార్యాలయానికి వచ్చిన ప్రజలు, పార్టీ కార్యకర్తలు, నాయకులను మంత్రి ఆప్యాయంగా పలకరించారు. వివిధ సమస్యలతో బాధపడుతున్న ప్రజలు, పార్టీ కార్యకర్తల నుంచి వినతులు స్వీకరించారు. పలు సమస్యల పరిష్కారానికి అప్పటికప్పుడే అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. అన్ని విధాల అండగా ఉంటామని ప్రజలకు మంత్రి భరోసా ఇచ్చారు.

# పెందుర్తి నియోజకవర్గంలో రైల్వే అభివృద్ధి పనులకు శ్రీకారం.

★ ఇటీవల ఎంపీ సి.ఎం రమేష్ ప్రస్తావించిన పనులకు రైల్వే శాఖ టెండర్ ప్రకటన.




**అనకాపల్లి, పెన్ సత్తా, మార్చి 12:**రైల్వే స్టాండింగ్ కమిటీ చైర్మన్, అనకాపల్లి పార్లమెంట్ సభ్యులు డాక్టర్ సి.ఎం రమేష్ ఇటీవల జరిగిన రైల్వే సమీక్ష సమావేశంలో పెందుర్తి నియోజకవర్గానికి సంబంధించిన అభివృద్ధి పనులను ప్రత్యేకంగా ప్రస్తావించి త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను సూచించిన నేపథ్యంలో రైల్వే శాఖ చర్యలు ప్రారంభించింది. ఆ మేరకు సంబంధిత పనుల కోసం నేడు టెండర్లను ఆహ్వానించింది. పెందుర్తి - సింహాచలం నార్త్ రైల్వే మార్గం వద్ద శర్మ శక్తి నగర్ ప్రజలు స్మశాన వాటికకు సులభంగా చేరుకునేలా రోడ్ అండర్ బ్రిడ్జ్ నిర్మాణానికి డాక్టర్ సి.ఎం రమేష్ డివిజనల్ రైల్వే మేనేజర్, జనరల్ మేనేజర్ దృష్టికి ప్రత్యేకంగా తీసుకెళ్లారు. ఈ ప్రతిపాదన పై రైల్వే అధికారులు తక్షణమే స్పందించి రోడ్ అండర్ బ్రిడ్జ్ నిర్మాణం కోసం ఈస్ట్ కోస్ట్ రైల్వే ద్వారా టెండర్ ప్రకటన విడుదల చేశారు.
ఈ పనికి సుమారు రూ.1.72 కోట్ల వ్యయంతో నిర్మాణం చేపట్టనున్నారు. టెండర్ ప్రక్రియ పూర్తయిన వెంటనే పనులు ప్రారంభించి సుమారు 12 నెలల్లో ప్రాజెక్టును పూర్తి చేయడానికి చర్యలు తీసుకుంటామని రైల్వే అధికారులు తెలిపారు. ఈ నిర్మాణం పూర్తయిన అనంతరం శ్రమ శక్తి నగర్ ప్రాంత ప్రజలకు స్మశాన వాటికకు వెళ్లేందుకు సురక్షిత మైన సౌకర్యవంత మైన మార్గం అందుబాటు లోకి రానుంది. ప్రజా సమస్యలను గుర్తించి వెంటనే పరిష్కార దిశగా చర్యలు తీసుకుంటున్న అనకాపల్లి పార్లమెంట్ సభ్యులు డాక్టర్ సి.ఎం రమేష్ చొరవతో ఈ పనికి శ్రీకారం చుట్టబడిందని కూటమి నాయకులు పేర్కొన్నారు.

## నేడు అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ నిధులు విడుదల.

★ జిల్లాలో 2,42,536 మంది రైతులకు వర్తింపు
★ జిల్లా వ్యాప్తంగా రూ.134.27 కోట్లు రైతుల ఖాతాల్లో జమ జిల్లా కలెక్టర్




**అనకాపల్లి, పెన్ సత్తా, మార్చి 12:** అన్నదాత సుఖీభవ - పిఎం కిసాన్ పథకం కింద జిల్లా వ్యాప్తంగా రూ.134.27 కోట్ల నిధులు 2,42,536 మంది రైతుల ఖాతాల్లో నేడు జమ కానున్నట్లు జిల్లా కలెక్టర్ విజయ క్రిష్ణన్ గురువారం ప్రకటనలో తెలిపారు.
నియోజకవర్గం లోని 22,202 లబ్ధిదారులకు రూ.12.30 కోట్లు, చోడవరం నియోజకవర్గం లోని 51,269 లబ్ధిదారులకు రూ. 28.38 కోట్లు, వడ్డాది మాడుగుల నియోజకవర్గం లోని 45,604 లబ్ధిదారులకు రూ.25,25 కోట్లు, నర్సీపట్నం నియోజకవర్గం లోని 35,147 లబ్ధిదారులకు రూ. 19.69 కోట్లు, పాయకరావుపేట నియోజకవర్గం లోని 39,302 లబ్ధిదారులకు రూ. 21.67 కోట్లు, పెందుర్తి నియోజకవర్గం లోని 15,364 లబ్ధిదారులకు రూ.8.54 కోట్లు, యలమంచిలి నియోజకవర్గం లోని 33, 648 లబ్ధిదారులకు రూ. 18.45 కోట్లు వెరసి జిల్లాలో మొత్తం 2,42,536 లబ్ధిదారులకు రూ. 134.27 కోట్లు 3 వ విడత అన్నదాత సుఖీభవ, 22 వ విడత కిసాన్ నిధులు విడుదల కానున్నట్లు జిల్లా కలెక్టర్ విజయ క్రిష్ణన్ ప్రకటన లో తెలిపారు.

# నూకాంబికను దర్శించుకున్న గుడివాడ అమర్నాధ్

**అనకాపల్లి, పెన్ సత్తా, మార్చి 12:**రాష్ట్ర పండగగా గుర్తింపు పొందిన, ఉత్తరాంధ్ర ఇలవేల్పు, గరపాలెంలో వెలసిన నూకాంబిక అమ్మవారి దేవస్థానంలో గురువారం మాజీ మంత్రి గుడివాడ అమర్నాధ్ ఆధ్వర్యంలో వైసీపీ నాయకులు నూకాంబిక అమ్మవారిని దర్శించుకున్నారు. మాజీ మంత్రి గుడివాడ అమర్నాద్ తో పాటు మాజీ ఎంపీ బీశెట్టి వెంకట సత్యవతి, జిల్లా వైసీపీ అధ్యక్షులు బొడ్డేడ ప్రసాద్, పార్లమెంట్ పరిశీలకులు శోభ హైమావతి, అనకాపల్లి నియోజకవర్గ వైసిపి ఇంచార్జ్ మలసాల భరత్ కుమార్, వైసీపీ నాయకులు మందపాటి జానకి రామరాజు, జాజుల రమేష్, కే. ఎం. నాయుడు, బొడ్డేడ శివ, కోరుకొండ రాఘవ, ఎంపీపీ గొర్లి సూరిబాబు, గొల్లవిల్లి శ్రీను, మలసాల కిషోర్, పెద్దిశెట్టి గోవింద ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. వారికి ప్రస్తుత ఆలయ చైర్మన్ పీలా నాగ శ్రీను, మాజీ దేవస్థానం చైర్మన్ కొణతాల మురళీ కృష్ణ, ధర్మకర్తలు ఘన స్వాగతం పలికారు. పూజా కార్యక్రమాలు నిర్వహించి అమ్మవారికి హారతులు పట్టారు. అనంతరం ఆలయ మర్యాదలతో ఘనంగా సత్కరించి ప్రసాదం అందజేశారు. ఈ సందర్భంగా గుడివాడ అమరనాధ్ మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం హయంలో గుడి నిర్మాణం ప్రారంభించబడి, నేటి ప్రభుత్వ హయాంలో పూర్తి అయ్యి నేడు భక్తులకు అందుబాటు లోకి రావడం సంతోషకరం అని, 10 కోట్ల రూపాయల నిధులతో నేడు విశాలంగా నిర్మాణం
కావడం చాలా ఆనందం అని అన్నారు. నూకాలమ్మ వారి ఆశీస్సులు అందరి పై వుండాలని అన్నారు. ఈ కార్యక్రమంలలో ఆలయ సహా కమిషనర్ యాళ్ళ శ్రీధర్, ఆలయ ధర్మకర్తలు సూరే సతీష్, దాడి రవి కుమార్, పొలిమేర స్వాతి ఆనంద్, మారిశెట్టి శంకర్రావు, కాండ్రేగుల రాజారావు, మజ్జి జానకి శ్రీనివాస రావు, కొడుకుల శ్రీకాంత్, వడ్డాది మంగ, కోనేటి సూర్యలక్ష్మి పైడిరాజు, యర్రవరపు సంతోషి కుమారి నాగేష్, మాజీ
ధర్మకర్తల తదితరులు పాల్గొన్నారు.





# బసవతారకం ఆసుపత్రి సేవల్ని క్షేత్ర స్థాయికి తీసుకొచ్చిన ఘనత బాలక్రిష్ణదే










★ క్యాన్సర్ బాధితులకు వారు అందిస్తున్న సేవలు వెలకట్టలేనివి పరిటాల శ్రీరామ్.
★ పాపంపేటలో బసవతారకం ఆసుపత్రి ఆధ్వర్యంలో ఉచిత క్యాన్సర్ నిర్ధారణ శిబిరం.
★ అవసర మైన వారికి ఉచితంగా చికిత్సలు అందిస్తారన్న శ్రీరామ్.

**అనంతపురం, పెన్ సత్తా, మార్చి 12:**హైదరాబాద్ కేంద్రంగా ఎంతో మంది ప్రాణాలు కాపాడుతున్న బసవతారకం క్యాన్సర్ ఆసుపత్రి సేవల్ని క్షేత్ర స్థాయికి తీసుకొచ్చిన ఘనత ఎమ్మెల్యే నందమూరి బాలక్రిష్ణ దేనని ధర్మవరం నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇన్ ఛార్జి పరిటాల శ్రీరామ్ అన్నారు. రాప్తాడు నియోజకవర్గం అనంతపురం రూరల్ మండల పరిధి లోని పాపంపేటలో బసవతారకం ఇండో - అమెరికన్ క్యాన్సర్ హాస్పిటల్ ఆధ్వర్యంలో క్యాన్సర్ వ్యాధి పై అవగాహన, ఉచిత క్యాన్సర్ నిర్ధారణ శిబిరాన్ని నిర్వహించారు. హైదరాబాద్ కు చెందిన ప్రముఖ వైద్యులు డా.రవి శంకర్, డా.జ్యోతి, డా.మన్విత, డా.ప్రభాకర్ ఈ కార్యక్రమానికి తరలివచ్చారు. క్యాంప్ మేనేజర్ లక్ష్మణ్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. పాపంపేటలో వందలాది మందికి ఎక్స్-రే చెస్ట్, అల్ట్రాసౌండ్, అబ్డోమెన్, అల్ట్రాసౌండ్ నెక్, మమ్మోగ్రఫీ, పాప్స్మెర్ వంటి అత్యాధునిక పరీక్షలు ఉచితంగా నిర్వహించారు. ఈ శిబిరాన్ని ధర్మవరం టీడీపీ ఇన్ ఛార్జి పరిటాల శ్రీరామ్ సందర్శించారు. వైద్యులతో మాట్లాడి ఈ ప్రాంతంలో ప్రజలకు ప్రాథమికంగా నిర్ధారించిన పరీక్షల గురించి ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భయంకర మైన క్యాన్సర్ వ్యాధితో బాధపడుతున్న ఎంతో మంది ప్రాణాలు కాపాడిన ఆసుపత్రి బసవతారకం అన్నారు. ఆరోజు ఎన్టీఆర్ ఎంతో మంచి ఉద్దేశ్యంతో స్థాపించిన ఈ ఆసుపత్రిని వంద రెట్లు పైకి తీసుకెళ్లిన ఘనత ఎమ్మెల్యే బాలక్రిష్ణ కే దక్కుతుందన్నారు. ఓ వైపు రాజకీయాలు, ఇంకో వైపు సినిమాలతో బిజీగా ఉన్నప్పటికీ, ఆయన క్యాన్సర్ ఆసుపత్రికి తగిన సయమాన్ని కేటాయిస్తూ ఎంతో మందికి సేవలందిస్తున్నారన్నారు. ఇక్కడ స్క్రీనింగ్ క్యాన్సర్ నిర్ధారణ అయిన వారికి హైదరాబాద్ లోని ఆసుపత్రిలో చికిత్సలు అందిస్తారని శ్రీరామ్ అన్నారు.

# ఘనంగా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ 15 వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

**భీమిలి, పెన్ సత్తా, మార్చి 12:**వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అది నాయకుడు, మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్ మోహన రెడ్డి నాయకత్వంలో పార్టీ 15 వసంతాలను విజయవంతంగా పూర్తి చేసుకుని, 16 వ ఏట అడుగుపెట్టిన శుభ సందర్భాన్ని పురస్కరించుకుని భీమిలి నియోజకవర్గంలో వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆనందపురం లోని వైఎస్ఆర్సిపి పార్టీ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో విజయనగరం జిల్లా జడ్పీ చైర్మన్, పార్టీ జిల్లా అధ్యక్షులు, భీమిలి నియోజకవర్గ సమన్వయకర్త మజ్జి శ్రీనివాసరావు (చిన్న శ్రీను) ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా తన కుమార్తె మజ్జి సిరి సహస్ర (సిరమ్మ) భీమిలి నియోజకవర్గ పరిశీలకులు, మాజీ శాసనసభ్యులు తైనాల విజయ కుమార్ తో కలిసి పార్టీ జెండాను ఆవిష్కరించి, కేక్ కట్ చేసి కార్యకర్తలకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా చిన్న శ్రీను మాట్లాడుతూ అరిచేత్తో సూర్యుడిని ఆపడం ఎంత అసాధ్యమో, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ప్రభంజనాన్ని ఆపడం కూడా అంతే అసాధ్యం అన్నారు. 2029 లో మళ్లీ జగన్ మోహన్ రెడ్డి నాయకత్వంలో పార్టీ అధికారం లోకి రావడం ఖాయం అన్నారు. ప్రతి కార్యకర్త ప్రజలతో మమేక మై, జగన్ ని మళ్లీ ముఖ్యమంత్రిని చేయడానికి ఇప్పటి నుంచే నడుం బిగించాలని పిలుపునిచ్చారు. ప్రస్తుత ప్రభుత్వం దోపిడీయే ధ్యేయంగా సాగుతోంది, అక్రమంగా భూములు లాక్కోవడం, అవినీతికి పాల్పడటమే పనిగా పెట్టుకున్నారని ఆరోపించారు. రాష్ట్రంలో ఎక్కడా సరైన పరిపాలన కనిపించడం లేదు. 2014లో లాగే, 2024 లో కూడా తప్పుడు హామీలతో అధికారం లోకి వచ్చారు. అధికారం లోకి వచ్చి రెండేళ్లు కావస్తున్నా (సందర్భోచితంగా), ఎన్నికల్లో ఇచ్చిన ఒక్క హామీని కూడా ఈ ప్రభుత్వం నెరవేర్చలేక పోయిందన్నారు.
ప్రజల పక్షాన పోరాడి 2029 ప్రజా కోర్టులో ఈ ప్రభుత్వానికి శిక్ష పడేలా చేస్తాం. ఈ కార్యక్రమంలో
ఎస్ఈసి మెంబర్లు, రాష్ట్ర పార్టీ కార్యదర్శులు, మండల పార్టీ అధ్యక్షులు, ఎంపీపీ లు, జడ్పీటీసీ లు, జిల్లా & నియోజకవర్గ అనుబంధ విభాగాల అధ్యక్షులు, రాష్ట్ర, జిల్లా, మండల పార్టీ కమిటీ సభ్యులు, కార్పొరేటర్లు, కౌన్సిలర్లు, సర్పంచ్ లు, ఎంపీటీసీ లు, మహిళ ప్రజా ప్రతినిధులు, సోషల్ మీడియా కార్యకర్తలు, మాజీ ప్రజా ప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.







# అప్పు ఇచ్చి అధిక వడ్డీతో ప్రజలను వేధిస్తే కఠినంగా వ్యవహరిస్తాం ఎస్పీ

**విజయనగరం, పెన్ సత్తా, మార్చి 12:**జిల్లాలో కాల్‌మనీ వ్యాపారం నిర్వహిస్తూ ప్రజలను అధిక వడ్డీ రేట్లతో వేధిస్తున్న వ్యక్తుల పై కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా ఎస్పీ ఎ.ఆర్.దామోదర్ గురువారం ఒక ప్రకటనలో హెచ్చరించారు. కాల్‌మనీ పేరుతో సాధారణ ప్రజలను మోసం చేయడం, అధిక వడ్డీ వసూలు చేయడం, అప్పు తీసుకున్న వారిని బెదిరించడం, ఇచ్చిన అప్పుకంటే అధికంగా వసూలు చేస్తూ ప్రజల ఆస్తులను స్వాధీనం చేసుకోవడం వంటి చర్యలు చట్ట విరుద్ధమని జిల్లా ఎస్పీ ఎ.ఆర్.దామోదర్ తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ ఎ.ఆర్.దామోదర్ మాట్లాడుతూ ఇటీవలి కాలంలో కొంత మంది వేరే జిల్లా వ్యక్తులు విజయనగరం జిల్లాకు వచ్చి అవసరాల్లో ఉన్న ప్రజలను గుర్తించి వారికి అప్పులు ఇచ్చి, అధిక వడ్డీ రేట్లు వసూలు చేస్తూ వారిని ఆర్థికంగా, మానసికంగా వేధిస్తూ వ్యాపారం చేస్తున్నారని పోలీసుల దృష్టికి వచ్చినట్లు తెలిపారు. వీరు ప్రజల అవసరాలకు డబ్బులు ఇచ్చి వారి నుండి బ్లాంక్ ప్రామిసరీ నోటు, బాండ్ పేపర్, తెల్లకాగితం మీద సంతకాలు తీసుకోని వాటిని కోల్కతా, బిహార్ వంటి బయట రాష్ట్రాల న్యాయ స్థానాలలో వేసి ప్రజలను న్యాయ స్థానాలకు రప్పించి, వారిని భయభ్రాంతులకు గురిచేస్తూ వేధిస్తున్నారన్నారు. ఇలాంటి కాల్‌మనీ వ్యాపారం వల్ల పేద మధ్యతరగతి కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని అన్నారు. కాల్‌మనీ వ్యాపారం నిర్వహించే వ్యక్తుల పై చట్టపర మైన కఠిన చర్యలు తీసుకుంటామని, అటువంటి వారి పై కేసులు నమోదు చేసి, వారి ఆస్తులను జప్తుచేయటం జరుగుతుందని, వారి పై రౌడీ షీటులు తెరవబడతాయని, అవసర మైతే ఇటువంటి కేసులను స్వచ్ఛంద దర్యాప్తు సంస్థలైనటువంటి సి.బి.ఐ, ఈ.డి., సిట్ కు దర్యాప్తు కోసం బదిలీ చేసి జైలుకు పంపడం జరుగుతుందని హెచ్చరించారు. ఎవరి కైనా కాల్‌మనీ ద్వారా వేధింపులు ఎదురైతే వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌లో కాని, డయిల్ 100/112కు కాని ఫిర్యాదు చేయాలని జిల్లా ఎస్పీ సూచించారు.
ప్రజలకు విజ్ఞప్తి : ప్రజలు అవసరాల కోసం కాల్‌మనీ వ్యక్తులను ఆశ్రయించకుండా బ్యాంకులు, సహకార సంఘాలు వంటి చట్టబద్ధ మైన ఆర్థిక సంస్థలను మాత్రమే సంప్రదించాలని జిల్లా ఎస్పీ సూచించారు. అలాగే ఎవరైనా అధిక వడ్డీతో అప్పులు ఇస్తూ వేధింపులకు పాల్పడితే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. ప్రజల భద్రత, సంక్షేమం కోసం జిల్లా పోలీసు శాఖ ఎల్లప్పుడూ కట్టుబడి ఉందని, అక్రమ కార్యకలాపాలను సహించబోమని జిల్లా ఎస్పీ ఎ.ఆర్.దామోదర్ స్పష్టం చేశారు.



# ఆపరేషన్ వజ్రప్రహార్ లో భాగంగా తనిఖీలు ప్రారంభం.




అనకాపల్లి సబ్-డివిజన్ లో మెగా కార్డన్ అండ్ సర్చ్ నిర్వహించిన పోలీస్.

**అనకాపల్లి, పెన్ సత్తా, మార్చి 12:** అనకాపల్లి ఏఎంసి కాలనీ, చేపల బజార్, విజయరామరాజుపేట, అనకాపల్లి టౌన్ పోలీస్ స్టేషన్ పరిదిలో గురువారం వజ్రప్రహార్ లో భాగంగా జిల్లా పోలీస్ లు మెగా కార్డన్ అండ్ సర్చ్ నిర్వహించారు.
రాష్ట్ర డీజీపీ హరీష్ కుమార్ గుప్తా ఆదేశముల మేరకు, ఈగల్ చీఫ్ ఆకే రవి కృష్ణ, గోపీనాథ్ జెట్టి విశాఖపట్నం రేంజ్ ఐజీపీ పర్యవేక్షణలో, అనకాపల్లి జిల్లా సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్, తుహిన్ సిన్హా పర్యవేక్షణలో ఈ తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీలలో డిప్యూటీ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ ఎం. శ్రావణి ఆధ్వర్యములో అనకాపల్లి టౌన్ (ఎల్&ఓ) , అనకాపల్లి టౌన్ ట్రాఫిక్, అనకాపల్లి రూరల్ సర్కిల్ పోలీస్ స్టేషన్లకు చెందిన సి.ఐ. లు, ఎస్.ఐ. లు, సిబ్బంది, ఈగల్ టీం, స్పెషల్ పార్టీ మొత్తం 115 మందితో ఎస్డీపిఓ, ఆధ్వర్యములో జరిగినది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో మాదకద్రవ్యాల నియంత్రణకు చేపట్టిన ప్రత్యేక కార్యక్రమం ఆపరేషన్ వజ్రప్రహార్ లో భాగంగా, అనకాపల్లి టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఏఎంసి కాలనీ, చేపల బజార్, విజయరామరాజుపేటలో గురువారం మెగా కార్డన్ & సెర్చ్ ఆపరేషన్ విస్తృతంగా నిర్వహించబడింది. రాష్ట్ర వ్యాప్తంగా మాదకద్రవ్యాల వినియోగం, అక్రమ రవాణా, సంబంధిత నేరాలను అరికట్టడమే లక్ష్యంగా ఈ ప్రత్యేక తనిఖీలు చేపట్టబడ్డాయి. ఈ మెగా కార్డన్ అండ్ సర్చ్ ఆపరేషన్ లో పోలీసు అధికారులు, సిబ్బంది, స్పెషల్ టీమ్‌లు కలిసి ఏఎంసి కాలనీ లోగల గృహ సముదాయాలు, పాడుబడిన ఇల్లు, ఇతర ప్రదేశాలలో విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. గతంలో గంజాయి కేసులలో ప్రమేయం ఉన్నటువంటి ముద్దాయిల ఇంటిల్లో పోలీసులు సోదాలు నిర్వహించారు. ఈ కార్డన్ & సెర్చ్ ఆపరేషన్‌లో భాగంగా మొత్తం 14 మంది పోలీసు అధికారులు, 90 మంది సిబ్బంది పాల్గొని కాలనీ లో ఇల్లులను, వ్యక్తులను తనిఖీచేశారు. వాహనాలను తనిఖీ చేసి రికార్డ్స్ లేని 09 మోటార్ సైకిళ్ళు ను స్వాధీన పరచుకోవడ మైనది. నిమ్మకాయల జ్యోతి సూర్య ప్రభాకర్ ఊరఫ్ జ్యోతి సన్నాఫ్ (లేటు) అప్పలరాజు అనే ఆసామి ఇంటి వద్ద నుండి 03 కేజీ ల గంజాయి మూటను, దొడ్డి తిమోతి ఊరఫ్ ఆది ఇంటి వద్ద 04 కేజిల గంజాయిని, అదే విధముగా మల్లంపర్తి గణేష్ ఊరఫ్ రామ్స్ సన్ ఆఫ్ చిన్నారావ్ అను వాని ఇంటి వద్ద డ్రగ్ ఇన్స్పెక్టర్ సమక్షములో మేఫెంట్రమినే సల్ఫేట్ ఇంజక్షన్ ఐ.పి. బాటిల్స్ ను వశపరచుకోవడమైనది. ఈ సందర్భంగా పోలీసు అధికారులు ప్రజలకు మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే ఆరోగ్య, సామాజిక, చట్టపర మైన దుష్పరిణామాల గురించి అవగాహన కల్పించారు. గంజాయి, ఇతర మాదకద్రవ్యాల వినియోగం యువత భవిష్యత్తును నాశనం చేస్తుందని, కుటుంబ వ్యవస్థ పై తీవ్ర ప్రభావం చూపుతుందని వివరించారు. ప్రజలు తమ పరిసర ప్రాంతాల్లో గంజాయి లేదా ఇతర మాదకద్రవ్యాలకు సంబంధించిన సమాచారం ఉంటే వెంటనే ఏపీ ఈగల్ టోల్ ఫ్రీ నెంబర్ 1972, 100 కు సమాచారం అందించాలని పోలీసులు విజ్ఞప్తి చేశారు. సమాచారం ఇచ్చే వారి వివరాలు పూర్తిగా గోప్యంగా ఉంచబడతాయని హామీ ఇచ్చారు. అదే విధంగా ఈ కార్యక్రమంలో భాగంగా పోలీసు అధికారులు, సిబ్బంది ప్రజలతో కలిసి ఆపరేషన్ వజ్రప్రహార్ ప్రతిజ్ఞ నిర్వహించి, మాదకద్రవ్యాలకు వ్యతిరేకంగా పోరాడాలని ప్రతిజ్ఞ చేశారు. సమాజాన్ని డ్రగ్స్ రహితంగా మార్చడంలో ప్రజల సహకారం ఎంతో ముఖ్యమని ఈ సందర్భంగా అధికారులు పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో మాదకద్రవ్యాల వ్యాప్తిని పూర్తిగా అరికట్టే దిశగా ఆపరేషన్ వజ్రప్రహార్ కింద ఇలాంటి ప్రత్యేక చర్యలు నిరంతరం కొనసాగుతాయని పోలీసులు తెలిపారు. ప్రజల సహకారంతో డ్రగ్స్ రహిత సమాజాన్ని నిర్మించడమే ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు.

# మరిడి మాంబ దేవస్థానం నుంచి నూకాంబికకు సారె





**అనకాపల్లి, పెన్ సత్తా, మార్చి 12:** కోట్నివీధి మరిడి మాంబ అమ్మవారి దేవస్థానం ఆధ్వర్యంలో నూకాంబిక అమ్మవారికి మహిళలు పసుపు కుంకాలు, వివిధ రకాల పిండి వంటలు తయారుచేసి ఊరేగింపుగా ఆలయాలు చేరుకొని అమ్మవారి సారె సమర్పించారు. కోట్నీ వీధి పంచాయితీ పెద్దలు, మరిడి మాంబ అమ్మవారి ఉత్సవ కమిటీ సభ్యులు, వీరిని దేవస్థానం చైర్మన్ పీలా నాగశ్రీను (గొల్ల బాబు), ఆలయ సహా కమిషనర్ యాళ్ళశ్రీధర్ ఘనంగా సత్కరించారు. ఆలయ ధర్మకర్తలు సూరే సతీష్ కుమార్, దాడి రవికుమార్, పొలిమేర స్వాతి ఆనంద్ కుమార్, మారిశెట్టి శంకర్రావు, కాండ్రేగుల రాజారావు, మజ్జి జానకి శ్రీనివాసరావు, కొడుకుల శ్రీకాంత్, వడ్డాది మంగ, కోనేటి సూర్యలక్ష్మి పైడిరాజు, యర్రవరపు సంతోషి కుమారి నాగేష్, తదితరులు పాల్గొన్నారు.

# మహిళా శిక్షణార్ధులకు ఎన్టీపీసీ సింహాద్రి కుట్టు కిట్లను పంపిణీ

**పరవాడ, పెన్ సత్తా, మార్చి 12:** ఎన్టీపీసీ సింహాద్రి, దాని కార్పొరేట్ సామాజిక బాధ్యత (సీఎస్సార్) కార్యక్రమం కింద, సమీప సమాజాల మహిళలకు నైపుణ్యాభివృద్ధి, జీవనోపాధి అవకాశాల ద్వారా సాధికారత కల్పించడానికి గురువారం నాయుడుపాలెంలో అధునాతన దర్జీ శిక్షణా కార్యక్రమాన్ని ప్రారంభించింది.
బీసీటీ ఎన్జిఓ సహకారంతో అమలు చేయబడుతున్న నాలుగు నెలల శిక్షణా కార్యక్రమం, స్థానిక మహిళల సాంకేతిక దర్జీ నైపుణ్యాలను పెంపొందించడం, స్వయం ఉపాధి, స్థిరమైన ఆదాయ ఉత్పత్తికి మద్దతు ఇవ్వడం లక్ష్యంగా పెట్టుకుంది. చుట్టు పక్కల గ్రామాల నుండి మొత్తం 65 మంది మహిళా శిక్షణార్థులు ఈ కార్యక్రమంలో చేరారు. చౌరవలో భాగంగా, ఆచరణాత్మక శిక్షణ,




ఆచరణాత్మక అభ్యాసానికి మద్దతు ఇవ్వడానికి దర్జీ కిట్లను అందరికీ పంపిణీ చేశారు. కత్తెర, కొలిచే టేప్, దర్జీ సుద్ద, ప్రొఫెషనల్ కుట్టు పనికి అవసర మైన ఇతర ప్రాథమిక ఉపకరణాలు వంటి అవసరమైన దర్జీ సాధనాలు కిట్లలో ఉన్నాయి. అడ్వాన్స్డ్ టైలరింగ్ ప్రోగ్రామ్ రాబోయే నాలుగు నెలల పాటు కొనసాగుతుంది, ఈ సమయంలో శిక్షణ పొందినవారు అధునాతన కుట్టు పద్ధతులు, వస్త్ర అలంకరణ ఆచరణాత్మక అనుభవంలో నిర్మాణాత్మక శిక్షణ పొందుతారు. ఇది టైలరింగ్ రంగంలో వ్యవస్థాపకత, ఉపాధి అవకాశాలను మెరుగుపరుస్తుంది. ఇటువంటి కేంద్రీకృత సీఎస్సార్ కార్యక్రమాల ద్వారా, ఎన్టీపీసీ సింహాద్రి చుట్టు పక్కల ప్రాంతాలలో మహిళా సాధికారత, నైపుణ్య అభివృద్ధి, సమాజ అభ్యున్నతిని ప్రోత్సహిస్తూనే ఉంది.

# నక్కపల్లి లో ఘనంగా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ 16వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

**నక్కపల్లి, పెన్ సత్తా, మార్చి 12 :** మండల కేంద్రం నక్కపల్లి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయం వద్ద పార్టీ 16వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. వైయస్సార్సీపి రాష్ట్ర కార్యదర్శి వీసం రామకృష్ణ ఆధ్వర్యంలో మండలంలో ఉన్న వైయస్సార్సీపి ముఖ్య నాయకుల సమక్షంలో ఆవిర్భావ దినోత్సవ వేడుకలు అట్టహాసంగా నిర్వహించారు. పార్టీ కార్యాలయం వద్ద ఉన్న దివంగత నేత వైయస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి జడ్పిటిసి సభ్యురాలు గోసాల కాసులమ్మతో కలిసి వేసం రామకృష్ణ పూలమాలు వేసి రాజశేఖర్ రెడ్డి కి నివాళులర్పించారు. కార్యాలయం వద్ద వీసం రామకృష్ణ పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి స్వీట్లు పంచారు. ఈ కార్యక్రమంలో భాగంగా వీసం రామకృష్ణ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి దివంగత నేత వైయస్ రాజశేఖర్ రెడ్డి మరణంతో శోక సముద్రంలో ఉన్న రాష్ట్ర ప్రజలకు రాజశేఖర్ రెడ్డి తనయుడు వైయస్ జగన్మోహన్ రెడ్డి ప్రజలకు అండగా ఉంటానని ఇచ్చిన హామీ నుండి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆవిర్భవించిందని ఆయన అన్నారు. ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం వైయస్ జగన్మోహన్ రెడ్డి పాదయాత్ర నిర్వహించి ప్రజా సమస్యలు తెలుసుకుని ప్రజలకు అండగా నిలిచారన్నారు. పార్టీ ఆవిర్భావం నుండి ఎన్నో ఆటుపోట్లు ఎదుర్కొని రాష్ట్ర ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన వైయస్ జగన్మోహన్ రెడ్డి ప్రజా సంక్షేమ పథకాలను అమలు చేసి ప్రజా మన్నన పొందారన్నారు. మరలా జగన్మోహన్ రెడ్డి పాలన కోసం రాష్ట్ర ప్రజలు ఎదురుచూస్తున్నారని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వైయస్సార్సీపి ముఖ్య నాయకులు వెలగా ఈశ్వరరావు, పొడకట్ల పాపారావు, అయినంపూడి మణిరాజు, కొప్పిశెట్టి హరిబాబు, గొర్ల గోవిందు, తల్లా భార్గవ్, వీసం రాజు, పోతంశెట్టి బాబ్జి, నల్లల రామకృష్ణ, మన బాల తాతారావు, అల్లాడ కొండబాబు, పిక్కి తాతీలు నాయకులు, కార్యకర్తలు, పార్టీ అభిమానులు పాల్గొన్నారు.







## ఘనంగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ 16 వ ఆవిర్భావ దినోత్సవం వేడుకలు





**అనకాపల్లి, పెన్ సత్తా, మార్చి 12:** వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ 16 వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా పార్టీ కార్యాలయంలో గురువారం ఘనంగా వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిలుగా పశ్చిమ గోదావరి జిల్లా రీజనల్ కో ఆర్డినేటర్, మాజీ మంత్రి గుడివాడ అమర్నాథ్, అనకాపల్లి జిల్లా అధ్యక్షులు బొడ్డేడ ప్రసాద్, రాష్ట్ర సీఈసీ సభ్యురాలు బిశెట్టి వెంకట సత్యవతి, అనకాపల్లి సమన్వయకర్త మలసాల భారత్, వై.సి.పి రాష్ట్ర కార్యదర్శి, మాడుగుల, పాయకరావుపేట నియోజకవర్గ పరిశీలికులు పయిల శ్రీనివాసరావు, దంతులూరి దిలిపి కుమార్, గండి రవి కుమార్ పాల్గొని పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం పార్టీ కార్యకర్తలతో కలిసి కేక్ కట్ చేసి ఆవిర్భావ దినోత్సవాన్ని జరుపుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ స్థాపన నుంచే ప్రజల సంక్షేమం, సామాజిక న్యాయం, అభివృద్ధి లక్ష్యాలతో ముందుకు సాగిందని తెలిపారు. పార్టీ అధికారంలో లేకపోయినా ప్రజల సమస్యల పై పోరాటం చేస్తూ ప్రజల పక్షాన నిలబడుతుందని పేర్కొన్నారు. భవిష్యత్తులో పార్టీని మరింత బలోపేతం చేయడానికి కార్యకర్తలు సమిష్టిగా పనిచేయాలని పిలుపు నిచ్చారు. పార్టీ బలోపేతానికి ప్రతి కార్యకర్త కృషి చేయాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా, నియోజకవర్గ స్థాయి పార్టీ నాయకులు, అనుబంధ విభాగల అధ్యక్షులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## నూకాంబిక అమ్మవారి జాతర ఆహ్వాన పత్రికను ఆవిష్కరించిన బండారు



**దేవరాపల్లి, పెన్ సత్తా, మార్చి 12:** దేవరాపల్లి మండలం, వేచలం గ్రామంలో జరగనున్న నూకాంబిక అమ్మవారి జాతర మహోత్సవానికి సంబంధించిన ఆహ్వాన పత్రికను మాడుగుల శాసనసభ్యుల బండారు సత్యనారాయణ మూర్తి ఘనంగా ఆవిష్కరించారు. మార్చి 18, 2026 న నిర్వహించనున్న ఈ జాతర మహోత్సవం గ్రామ ప్రజల ఆధ్యాత్మిక విశ్వాసానికి ప్రతీకగా నిలుస్తుందని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామ దేవత అయిన నూకాంబిక అమ్మవారి జాతర వేచలం గ్రామానికి ప్రత్యేక గుర్తింపును తీసుకువస్తుందని తెలిపారు. ప్రతి సంవత్సరం జరిగే ఈ జాతరలో పరిసర ప్రాంతాల నుంచి కూడా భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుంటారని చెప్పారు. ఇలాంటి ఆధ్యాత్మిక వేడుకలు గ్రామీణ సంస్కృతి, సంప్రదాయాలను నిలబెట్టే ముఖ్యమైన పండుగలుగా నిలుస్తాయని ఆయన అభిప్రాయపడ్డారు. జాతర సందర్భంగా ఉదయం ప్రత్యేక పూజలు, అభిషేకాలు, అలంకరణలు నిర్వహించి అమ్మవారికి మహోత్సవ వేడుకలు జరపనున్నారు. గ్రామస్తులు, ఆలయ నిర్వాహకులు కలిసి సంప్రదాయబద్ధంగా పూజా కార్యక్రమాలు నిర్వహించేందుకు ఇప్పటికే ఏర్పాట్లు చేపట్టారు. అదే విధంగా జాతర సందర్భంగా భక్తుల కోసం కోలాట ప్రదర్శనలు, సాంస్కృతిక కార్యక్రమాలు, డీజే నృత్యాలు వంటి వినోద కార్యక్రమాలు కూడా ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. అలాగే జాతరకు వచ్చే భక్తులకు అన్నదానం, ప్రసాదాల పంపిణీ వంటి సేవా కార్యక్రమాలు కూడా నిర్వహించనున్నట్లు వెల్లడించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందాలని ఆలయ కమిటీ సభ్యులు కోరారు. ఈ మహోత్సవాన్ని విజయవంతం చేసేందుకు గ్రామస్తులు, దాతలు, కమిటీ సభ్యులు సమిష్టిగా సహకారం అందిస్తున్నారని తెలిపారు.
ఈ కార్యక్రమంలో వేచలం టీడీపీ గ్రామ శాఖ అధ్యక్షుడు రెడ్డి మల్లునాయుడు, కూటమి నాయకులు, గ్రామ పెద్దలు, భక్తులు పాల్గొన్నారు.

## అక్కినాపురం తండలో కంకర మిల్లు దగ్ధం

విలువైన సామాగ్రి అగ్నికి ఆహుతి

**పెన్ సత్తా, మార్చి 12** ఏన్కూరు మండల పరిధిలోని అక్కినాపురం తండ గ్రామం సమీపంలో ఉన్న కంకర మిల్లు గురువారం సాయంత్రం అగ్నికి ఆహుతైంది. గుర్తుతెలియని వ్యక్తులు కొండ ప్రాంతంలో నిప్పంటించడంతో ఆ మంటలు వేగంగా వ్యాపించి సమీపంలో ఉన్న కంకర మిల్లుకు చేరుకున్నాయి. గాలికి తోడు మంటలు తీవ్రంగా రగులుకోవడంతో కొద్ది సేపట్లోనే మిల్లులోని వివిధ యంత్రాలు మరియు సామాగ్రి అగ్నికి ఆహుతయ్యాయి. మిల్లులో ఉన్న క్రషర్ యంత్రం, కన్వేయర్ బెల్ట్, జనరేటర్, ఎలక్ట్రికల్ వైరింగ్, మోటార్లు, డీజిల్ డ్రములు, రబ్బరు బెల్టులు, ఇనుప పరికరాలు వంటి విలువైన సామాగ్రి మంటల్లో దగ్ధమైనట్లు సమాచారం. అగ్ని ప్రమాదం కారణంగా మిల్లుకు భారీ ఆస్తి నష్టం జరిగినట్లు స్థానికులు తెలిపారు.
మంటలు రగులుతున్నట్లు గమనించిన గ్రామస్థులు వెంటనే ఫైర్ సిబ్బందికి సమాచారం అందించారు. సమాచారం అందుకున్న ఫైర్ సిబ్బంది తక్షణమే సంఘటన స్థలానికి చేరుకుని గంటపాటు శ్రమించి మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. దీంతో పెద్ద ప్రమాదం తప్పినట్లు తెలిసింది. ఈ ఘటనపై స్థానిక మండల ఎస్సై సంధ్య సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. అగ్ని ప్రమాదానికి గల కారణాలపై వివరాలు సేకరించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు తెలిపారు.

# ఎన్టీపీసీ లో 5 వ తరగతి బాలికలకు వైద్య పరీక్షలు





**పరవాడ, పెన్ సత్తా, మార్చి 12:**జిఈఎం -2026 వర్క్‌షాప్ కోసం ఎన్టీపీసీ సింహాద్రి మెడికల్ స్క్రీనింగ్ ప్రారంభించింది. విద్య, అవగాహన, సమగ్ర అభివృద్ధి ద్వారా యువతులను సాధికారపరచడం లక్ష్యంగా ఎన్టీపీసీ యొక్క ప్రధాన సీఎస్సార్ చొరవలలో ఒకటైన బాలికా సాధికారత మిషన్ (జిఈఎం)-2026 వర్క్‌షాప్ కోసం ఎన్టీపీసీ సింహాద్రి కార్యకలాపాలను ప్రారంభించింది. ఈ వర్క్‌షాప్ యొక్క మొదటి కార్యాచరణ గురువారం పరవాడ మండల ప్రభుత్వ పాఠశాలల నుండి 5 వ తరగతి బాలికల వైద్య పరీక్షలు, ఆరోగ్య పరీక్షలతో ఎన్టీపీసీ సింహాద్రి లోని దీపాంజలినగర్ లోని జీవన్ రేఖ ఆసుపత్రిలో ప్రారంభమైంది.

ప్రారంభ రోజున, 40 మందికి పైగా బాలికలు ఎన్టీపీసీ సింహాద్రి ఆసుపత్రి వైద్యులు, వైద్య సిబ్బంది విద్యార్థినులకు సమగ్ర ఆరోగ్య పరీక్షలను నిర్వహించారు. జిఈఎం 2026 వర్క్ షాప్ కోసం లక్ష్యంగా పెట్టుకున్న విద్యార్థుల సంఖ్యను కవర్ చేసే వరకు స్క్రీనింగ్ కార్యక్రమం రాబోయే కొన్ని రోజుల పాటు కొనసాగుతుంది. ఆరోగ్య తనిఖీలో సాధారణ వైద్య పరీక్షలు, పాల్గొనే విద్యార్థుల శ్రేయస్సును నిర్ధారించడానికి అవసర మైన రోగనిర్ధారణ అంచనాలు ఉంటాయి.

ఈ చొరవలో భాగంగా, స్క్రీనింగ్ సమయంలో వైద్య సహాయం అవసర మైన విద్యార్థులకు అవసర మైన మందులు కూడా అందించ బడుతున్నాయి. గర్ల్ ఎంపవర్ మెంట్ మిషన్ (జిఈఎం) అనేది ఎన్టీపీసీ యొక్క ప్రధాన చొరవ, ఇది గ్రామీణ వర్గాల యువతులలో విశ్వాసం, జ్ఞానం, జీవిత నైపుణ్యాలను పెంపొందించడం పై దృష్టి పెడుతుంది. ఆరోగ్య అవగాహన, విద్య, వ్యక్తిత్వ వికాస సెషన్‌లు, ఎక్స్‌పోజర్ సందర్శనలతో సహా నిర్మాణాత్మక కార్యక్రమం ద్వారా, జిఈఎం బాలికలను శక్తివంతం చేయడం, వారి ఆకాంక్షలను కొనసాగించడానికి వారిని ప్రేరేపించడం లక్ష్యంగా పెట్టుకుంది. జిఈఎం కింద ప్రణాళిక చేయబడిన కార్యకలాపాల శ్రేణిలో ఆరోగ్య పరీక్ష ప్రారంభం మొదటి అడుగు, ఇది చుట్టు పక్కల ప్రాంతం లోని సమాజ అభివృద్ధి, సామాజిక బాధ్యత, బాలికల సాధికారత పట్ల ఎన్టీపీసీ సింహాద్రి నిబద్ధతను పునరుద్ఘాటిస్తుంది.

# చట్టబద్ధ బీసీ రిజర్వేషన్లతోనే ప్రభుత్వం స్థానిక సంస్థల ఎన్నికలకు వెళ్లాలి



ఏపీ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కేసన శంకరరావు

**బాపట్ల,పెన్ సత్తా,మార్చి 12 :**రాష్ట్రంలోని ఎన్డీఏ కూటమి ప్రభుత్వ ఎన్నికల వాగ్దానమైన బీసీల జనాభా దామాషా మేరకు రిజర్వేషన్లు చట్టబద్ధంగా అమలు జరిపే ముందే సమగ్రంగా కులగణన చేసి,విద్య,ఉద్యోగాలలో మాదిరిగా ఏబీసీడీఈ వర్గీకరణ చేసిన తరువాతే స్థానిక సంస్థల ఎన్నికలకు వెళ్లాలని ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కేసన శంకరరావు అన్నారు.గురువారం బాపట్ల పట్టణంలో జరిగిన మీడియా సమావేశంలో ఆ మేరకు ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.కూటమి ప్రభుత్వం ఎన్నికల వాగ్దానంగా ప్రకటించిన 33 శాతం చట్టసభలలో గాని,34 శాతం స్థానిక సంస్థలు - నామినేటెడ్ పోస్టులు - నామినేషన్ వర్క్స్ లలో రిజర్వేషన్లు అమలు జరపాలన్నా ముందుగా కులగణన జరపాల్సి ఉందన్నారు.ఏ ఏ సామాజిక వర్గాలు ఎవరెంత మంది ఉన్నారో తెలియకుండా,ఎవరికని, ఎంతెంతని రిజర్వేషన్లు అమలు చేస్తారని ఆయన ప్రశ్నించారు.అందుకే ముందుగా కులగణనను సమగ్రంగా నిర్వహించాలన్నారు.ఆపై బీసీలకు కేటాయించే చట్టబద్ధ రిజర్వేషన్లను వర్గీకరించి,అన్ని కులాలకు సమన్యాయం జరిగేలా స్థానిక సంస్థల ఎన్నికలను నిర్వహించాలన్నారు.రాజ్యాంగ మరియు న్యాయపర చిక్కులన్నింటినీ అధిగమించేలా రిజర్వేషన్లను చట్టబద్ధంగా అమలు పరచాలన్నారు.మొత్తం ప్రక్రియను వెంటనే ప్రారంభించి త్వరితగతిన పూర్తి చేసిన తరువాతే స్థానిక ఎన్నికలు నిర్వహించలన్నారు.మరో ఎన్నికల వాగ్దానమైన బీసీలకు ప్రత్యేక రక్షణ చట్టాన్ని కూడా త్వరలో రూపొందించి అమలు జరపాలని అన్నారు.అనేక దశాబ్దాల పోరాట ఫలితంగా జాతీయస్థాయిలో జనగణనతో పాటే సమగ్ర కులగణనకు కేంద్ర ప్రభుత్వాన్ని ఒప్పించి విజయం సాధించామని తెలిపారు.ఇంకా కేంద్రస్థాయిలో అపరిష్కృతంగా ఉన్న చట్టసభలలో ఓబీసీలకు రిజర్వేషన్లు,మహిళా రిజర్వేషన్లలో ఓబీసీ మహిళలకు సబ్ కోటా,కేంద్రంలో ఓబీసీ మంత్రిత్వ శాఖ ఏర్పాటు,ఓబీసీ సబ్ ప్లాన్ మేరకు బడ్జెట్లో నిధుల కేటాయింపులు చేయాలనే పలు డిమాండ్లపై పోరాటాలను ఉధృతం చేస్తామన్నారు.ముందుగా జనగణనతో పాటు కులగణన చేసి,బీసీల జనాభా లెక్కలు తేల్చాలన్నారు.జనాభా దామాషా మేరకు బీసీలకు స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లను చట్టబద్ధంగా నిర్ధారించాలన్నారు.అన్ని కులాలకు సమన్యాయం జరిగేలా సదరు రిజర్వేషన్లను ఏబీసీడీఈ లుగా వర్గీకరించాలన్నారు.అదే సమయంలో రిజర్వేషన్ల పైన సుప్రీం కోర్టు విధించిన 50 శాతం సీలింగు కూడా మన రాష్ట్రానికి వర్తించదని మరో చట్టం చేయాలన్నారు.కేంద్ర,రాష్ట్రాలలో తమరి డబుల్ ఇంజన్ సర్కారే ఉన్నందున అవసరం మేరకు పార్లమెంటుచే రాజ్యాంగ సవరణలైనా చేయించి,రాజ్యాంగం షెడ్యూల్ - 9 లో బీసీ రిజర్వేషన్ల అంశాన్ని చేర్చి,సంపూర్ణ చట్టబద్ధత కల్పించి రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చరితార్థులు కావాలని శంకరరావు ఆకాంక్షించారు.ఈ సమావేశంలో బీసీ సంక్షేమ సంఘం బాపట్ల జిల్లా ప్రధాన కార్యదర్శి బాపట్ల రవికుమార్,జిల్లా కార్యదర్శి ఎన్ ఎస్ పీ రాజు,తెనాలి పట్టణ అధ్యక్షులు వేముల కృష్ణ,యువజన నియోజకవర్గ అధ్యక్షులు నర్రావుల సాంబశివరావు,బాపట్ల పట్టణ ప్రధాన కార్యదర్శి కంకణాల రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

# ముఖ్యమంత్రి పర్యటనకు ముమ్మర ఏర్పాట్లు





**గన్నవరం, పెన్ సత్తా, మార్చి 12:**నియోజకవర్గంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పర్యటన నేపథ్యంలో ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు ఏర్పాట్లను ముమ్మరం చేశారు. శుక్రవారం నాడు సూరంపల్లి - మాదాలవారి గూడెం సరిహద్దులో నిర్వహించనున్న 'పిఎం కిసాన్ అన్నదాత సుఖీభవ మూడవ విడత నిధుల విడుదల కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా తీసుకున్న ఆయన, క్షేత్రస్థాయిలో ఏర్పాట్లను స్వయంగా పర్యవేక్షించారు. ముందుగా గన్నవరం నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో టీడీపీ కృష్ణ జిల్లా అధ్యక్షులు వీరంకి వెంకట గురుమూర్తి తో కలసి అన్ని మండలాల ముఖ్య నాయకులు, కార్యకర్తలతో యార్లగడ్డ ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వం చేపట్టిన ఈ సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. నియోజకవర్గంలోని ప్రతి గ్రామం నుండి పార్టీ శ్రేణులు, రైతులు ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చేలా ప్రణాళికలు సిద్ధం చేయాలని సూచించారు. సభకు వచ్చే వారికి ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని, సమన్వయంతో పనిచేసి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. అనంతరం కొండపావులూరు లోని ఎన్.డి.ఆర్.ఎఫ్ కేంద్రానికి వెళ్లిన ఎమ్మెల్యే యార్లగడ్డ అక్కడ ముఖ్యమంత్రి ల్యాండింగ్ కోసం సిద్ధం చేసిన హెలిప్యాడ్‌ను పరిశీలించారు. భద్రతా పరంగా ఎటువంటి చిన్న పొరపాట్లు జరగకూడదని, పోలీసు, రెవెన్యూ అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ముఖ్యమంత్రి పర్యటన సాఫీగా సాగేలా హెలిప్యాడ్ వద్ద అవసర మైన అన్ని మౌలిక సదుపాయాలను కల్పించాలని, ప్రోటోకాల్ విషయంలో జాగ్రత్తలు వహించాలని ఆయన స్పష్టం చేశారు.

## యుద్ధం సాకుతో జరుగుతున్న బ్లాక్ మార్కెట్ను అరికట్టాలి

పాత ధరలకు వంట గ్యాస్, ఇతర సరుకులు అందించాలి సిపిఎం



**అచ్యుతాపురం, పెన్ సత్తా, మార్చి 12:**ఇరాన్ పై అమెరికా, ఇజ్రాయిల్ దురాక్రమణ దాడి తర్వాత లాభాపేక్షతో బడా వ్యాపారస్తులు సాగిస్తున్న బ్లాక్ మార్కెట్ను అరికట్టి సరస మైన ధరలకు వంట గ్యాస్, ఇతర సరుకులు అందించాలని సిపిఎం డిమాండ్ చేస్తున్నది. ఈ రోజు పూడిమడకలో పెంచిన వంట గ్యాస్ ధరలను తగ్గించి బ్లాక్ మార్కెట్ ను అరికట్టాలని నిరసన తెలియజేయడం జరిగింది. ఈ సందర్భంగా సిపిఎం అచ్చుతాపురం కన్వీనర్ ఆర్ రాము, పూడి మడక శాఖ కార్యదర్శి చేపల తాతయ్య మాట్లాడుతూ వంటగ్యాస్ ధర పెరగడంతోపాటు బ్లాక్ మార్కెటింగ్ వల్ల సిలిండర్లు దొరకని కారణంగా దేశమంతటా నగరాలు, పట్టణాలు హోటళ్లు మూతపడడంతో పాటు, కొన్ని రకాల వంటకాలు లభించడం లేదని ఈ పరిస్థితి ఇలాగే కొనసాగితే సాధారణ మైన తోపుడుబండ్లు, చిన్న కాకా హోటళ్ల నిర్వాహకుల బతుకులు బజారునపడతాయని వివరించారు. అసంఘటిత కార్మికులు, చిరుద్యోగులకు లభించే టీ, టిఫిన్, భోజనం సరసమైన ధరకు దొరక్కుండా పోయే ప్రమాదం ఏర్పడుతుందని, ఈలోగా వాటి ధరలు అమాంతం పెరిగిపోతాయని, వంటగ్యాస్ కొరత వల్ల ఆహార లభ్యత మొదలు ఉపాధి వరకు వివిధ రూపాల్లో
సమాజంపై దుష్ప్రభావం పడుతుందని తెలిపారు. ఇప్పటికే గృహ వినియోగదారులు సిలిండర్ కోసం బుక్ చేస్తుంటే తగిన స్పందన ఉండటం లేదని, ఇంతకుముందే బుక్ చేసిన వారికీ ఐదారు రోజులైనా గ్యాస్ సిలిండర్ రావడం లేదని పేర్కొన్నారు. ఇళ్లలో, మార్కెట్లలో ఇటువంటి సమస్యలు ఏర్పడుతుండగా వ్యవసాయ రంగానికి కూడా ఎరువుల లభ్యత సమస్యగా మారనుందని పేర్కొన్నారు. గ్యాస్ కొరత రాకుండా బ్లాక్ మార్కెట్ను అరికట్టేందుకు ప్రభుత్వం వెంటనే తగు చర్యలు చేపట్టాలని, బ్లాక్ మార్కెటింగ్కు పాల్పడే వారిని కఠినంగా శిక్షించాలని కోరారు. ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలనంతరం పెట్రోలు, డీజిల్ ధరలూ పెరుగుతాయని వార్తలు వస్తున్నాయని, దాంతో సరుకు రవాణా, ప్రజా రవాణా కూడా భారమవుతాయని తెలిపారు. గల్ఫ్ ఎగుమతులు ఆగిపోయిన దృష్ట్యా గుడ్లు, పండ్లు, బియ్యం, ఆక్వా, గ్రానైట్ సరుకులు నిల్వలు ఉండిపోతున్నాయని, వ్యాపారస్తులు రైతుల నుండి వీటిని ధరలు తగ్గించి కొంటున్నారని యుద్ధం నివారణకు భారత ప్రభుత్వం చొరవ తీసుకొని ప్రజలపై భారాలు పడకుండా నివారించేందుకు చర్యలు చేపట్టాలని కోరారు ఈ కార్యక్రమంలో గనగల నూకరాజు, చేపల రవణమ్మ, సురాడ కోటి, చౌడుపల్లి పెంటమ్మ, ఇంకాయమ్మ తదితరులు పాల్గొన్నారు.

## పరిహారం పూర్తిగా చెల్లించాకే స్టీల్ ప్లాంట్ కు భూమి పూజ చేయాలి

ముఖ్యమంత్రి కి లేఖ రాసిన సిపిఎం నాయకులు



**నక్కపల్లి, పెన్ సత్తా, మార్చి 12 :** విశాఖ -చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్ నిర్వాసితులకు పూర్తిస్థాయిలో పరిహారం చెల్లించే వరకు స్టీల్ ప్లాంట్ నిర్మాణానికి భూమి పూజ చేయడానికి వీలులేదని సిపిఎం డిమాండ్ చేసింది. భూసేకరణలో నిర్వాసితులకు 2013 భూ సేకరణ చట్టం ప్రకారం పూర్తి పరిహారం, ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ అమలు చేయకుండా అర్సెల్ మిట్టల్ నిప్పన్ స్టీల్ ప్లాంట్ భూమి పూజ ఎలా చేస్తారని ప్రశ్నించారు. గురువారం సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యులు ఎం అప్పలరాజు ఆధ్వర్యంలో సిపిఎం నాయకులు విలేకరులతో మాట్లాడారు. ఈనెల 23న ఆర్సెల్ మిట్టల్ నిప్పన్ స్టీలుప్లాంటుకు భూమిపూజ జరపనున్నట్లుగా ప్రకటించారు. కాని ఆ ప్రాంతంలో భూ నిర్వాసితుల సమస్యలు ఇంకా పెండింగ్లో ఉన్నాయని తెలిపారు. అనకాపల్లి జిల్లా, నక్కపల్లి మండలంలో రాజయ్యపేట, బుచ్చిరాజుపేట, చందనాడ, అమలాపురం, డి. ఎల్. పురం పంచాయతీల పరిధిలో 11 గ్రామాల నుండి 5,500 ఎకరాల భూమి రైతుల నుండి బలవంతంగా ప్రభుత్వం సేకరించిందన్నారు.ఈ సందర్భంగా నిర్వాసితులకు 2013 భూ సేకరణ ప్రకారం ఇవ్వాల్సిన పరిహారం మరియు ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీలు ఇప్పటివరకు పూర్తిగా అమలు చేయలేదని అందులో 2,100 ఎకరాలు స్టీల్ ప్లాంటు ఏర్పాటు కు ఇచ్చారు. సర్వం కోల్పోయిన నిర్వాసితులకు ఇల్లు నిర్మించుకోవడానికి సమయం ఇవ్వకుండా,నిర్వాసిత కాలనీలో ఎలాంటి సౌకర్యాలు కల్పించకుండా ప్రస్తుతం నివశిస్తున్న ఇళ్ళు నేలమట్టం చేసి నిర్వాసితులను నడిరోడ్డుపై నెట్టివేయడం సరైందేనా అని ప్రశ్నించారు.రైతులు, నిర్వాసితులకు పర్మినెంట్ ఉద్యోగాలు ఇవ్వాలని,కంపెనీ నిర్మాణ దశలో నిర్వాసితులకు ఉపాధి కల్పించాలని జిరాయితీ భూములతో సమానంగా డి-ఫారం సాగు భూములకు కూడా పూర్తిస్థాయి పరిహారం చెల్లించాలని అన్నారు. వివాహం అయిన ఆడ పిల్లలకు భూసేకరణ సందర్భంలో ఇచ్చిన హామీ ప్రకారం ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ, ఇంటి స్థలం ఇవ్వాలని 18 సంవత్సరాలు నిండిన ప్రతి యువతీ, యువకుడికి చట్టప్రకారం ప్యాకేజీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. నిర్వాసితుల కాలనీలో విద్యా, వైద్యం, విద్యుత్, నీటి సౌకర్యం తో పాటు 25 రకాల మౌలిక సదుపాయాలు పూర్తిగా ఏర్పాటు చేయాలన్నారు.

భూములు కోల్పోయిన నిర్వాసిత గ్రామాల్లో ఉపాధి పనులు కల్పించాలని కోరారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకి పంపించిన వినతిపత్రం ను నక్కపల్లి సిపిఎం కార్యాలయం లో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు ఎం. అప్పలరాజు, జిల్లా కమిటీ సభ్యులు ఎం. రాజేష్, మండల నాయకులు ఎం. మహేష్ బాబు, కె. ప్రసాద్ తదితరులు, పత్రికలకు విడుదల చేశారు.

RNI:APTEL/2023/87729
పెన్ సత్తా
PEN SATTA Telugu Daily

# ఎడిటోరియల్

## ఇరాన్‌కు చైనా ఆయుధాల వాస్తవాలు?

త్వరలో ఇరాన్‌పై యుద్ధం ముగుస్తుందని డోనాల్డ్ ట్రంప్ ప్రకటించాడు. అది నిజమో కాదో ఎత్తుగడో తెలియదు. సోమవారం నాడు 116 డాలర్లకు పెరిగిన బ్రెంట్ రకం ముడి చమురు ధర మంగళవారం నాడు ఇది రాసిన సమయానికి 92 డాలర్లకు తగ్గింది. ఇదే విధంగా మన స్టాక్ మార్కెట్‌లో సోమవారం నాడు రెండున్నరవేల పాయింట్ల వరకు పతనమైన సూచి మంగళవారం నాడు ఆరువందల పాయింట్లు పెరిగింది.ఎప్పుడేం జరుగుతుందో తెలియదు. యుద్ధ ప్రభావం మనమీద పడుతున్నది. పెట్రోలు, డీజిలు కొరత లేదు గానీ వంటగ్యాస్ మండుతున్నది. ఇది ఒక అంశం. ఇరాన్‌పై జరిగిన దాడి సందర్భంగా కొంతమంది చైనా ఆయుధాల పనితీరు గురించి చర్చ చేస్తున్నారు. పాకిస్తాన్, వెనెజులా తరువాత ఇరాన్‌లో కూడా అవి తుస్సుమన్నాయని చెబుతున్నారు.ఇరాన్ దగ్గర ఆయుధ నిల్వలు తగ్గి పోయినట్లు, రోజూ ప్రయోగించే క్షిపణుల సంఖ్య పడిపోయినట్లు మరికొన్ని కథనాలు. మరోవైపున దాని క్షిపణి ప్రయోగ వ్యవస్థలన్నింటినీ నాశనం చేశామని అమెరికా చెబుతోంది.ఇంకో వైపున రోజూ క్షిపణి దాడుల వార్తలు తెలిసిందే. యుద్ధ సమయాల్లో ఇలాంటి పరస్పర విరుద్ధ ప్రచారాలు సహజమే. ఇరాన్‌కు మిత్రదేశాలు అని చెబుతున్న చైనా, రష్యా దాని తరపున యుద్ధంలోకి ఎందుకు దిగటం లేదు అని కొందరు తెలివిగా ప్రశ్నిస్తున్నామనుకుంటున్నారు. అమెరికా దాడిని అవి రెండూ ఖండించాయి. మనమూ యుద్ధంలోని మూడు దేశాలకూ మిత్రులమే కదా? మనమెందుకు యుద్ధంలో అడుగుపెట్టలేదని మోడీని ఎవరైనా ప్రశిస్తున్నారా? కనీసం ఇరాన్‌తో మాట్లాడను కూడా మాట్లాడలేదే! అనేక పశ్చిమ దేశాలు అమెరికాకు బహిరంగంగా మద్దతు ప్రకటించాయి, అవి కూడా తమ మిలిటరీలను దించలేదు. అమెరికా మిలిటరీ స్థావరాలను అనుమతించిన కారణంగా గల్ఫ్‌దేశాల మీద ఇరాన్ దాడులు జరుపుతున్నది.ప్రత్యక్ష బాధితులైన ఆ దేశాలు కూడా యుద్ధాన్ని ఎందుకు ప్రకటించటం లేదు. వాటి రక్షణకు అమెరికా చేస్తున్నదేమిటి? చెప్పేవాడు లోకువ అయితే అడిగేవాడు రెచ్చిపోతుంటాడు.

కొందరు విశ్లేషకులు చెబుతున్నదేమిటి ? తాజా యుద్ధంతో ప్రధానంగా నష్టపోయేది చైనా. హోర్ముజ్ జలసంధి దిగ్బంధనంతో చమురు సరఫరా నిలిచిపోతుంది.ఇరాన్‌లో దాని పెట్టుబడులకు దెబ్బతగులుతుంది. దాని ఆయుధాలు పనికిరావని తేలినందున కొనేవారు ఉండరు. అసలు ఇరాన్‌కు చైనా ఇచ్చిన ఆయుధాల గురించి ఊహాగానాలు తప్ప నిజానిజాలను నిర్ధారణగా చెప్పటం లేదు. చైనా ఆయుధాల గురించి చెబుతున్నవి వాస్తవం కాదు అని చెబుతున్నవారూ ఉన్నారు. విమానదాడుల నుంచి రక్షణకు జనవరిలో చైనా రాడార్లను భారీ విమానంలో పంపిందన్నది ఒక వార్త. రాడార్లు పెద్దవిగా ఉన్నందున ఉపగ్రహాల నిఘా నుంచి వాటిని దాచటం కష్టం. గతంలో చైనా ఆయుధాలను సరఫరా చేసింది. ఐరాస 2007లో చేసిన తీర్మానం తరువాత వాణిజ్యం నిలిచిపోయింది. అంతకు ముందు కుదిరిన ఒప్పందాల ప్రకారం 2015వరకు సరఫరాలు కొనసాగాయి. ఇరాన్ తయారు చేస్తున్న షాహేద్ డ్రోన్ల గురించి 2022 దర్యాప్తులో తేలిన అంశం ఏమంటే ఎనభై శాతం భాగాలు పశ్చిమదేశాలు అడ్డదారుల్లో అందించినవే. ఓల్టేజ్ కన్వర్టర్లు, ఇంజన్లు మాత్రం చైనావని చెప్పారు. ఇతర దేశాల డ్రోన్లు దొరికినపుడు వాటిని పరిశీలించి అదే రకాలను ఇరాన్ స్వయంగా తయారు చేస్తున్నది. పశ్చిమాసియా, మధ్య ప్రాచ్యంలోని ఇతర దేశాలతో కూడా చైనాకు మంచి సంబంధాలే ఉన్నాయి. అవి దెబ్బతినకుండా ఉండాలంటే సమతుల్యత పాటించాలి గనుక యుద్ధ విమానాలు కావాలని ఇరాన్ వత్తిడి తెచ్చినప్పటికీ వాటిని సరఫరా చేయలేదు. అయితే చైనా ఏమి సరఫరా చేసింది.2015లో కుదిరిన ఒప్పందం ప్రకారం భూమి, అంతరిక్షంలో సమాచార సేకరణ కేంద్రాలను ఇరాన్‌లో ఏర్పాటు చేసింది.తరువాత 2021లో కుదిరిన 25 సంవత్సరాల ఒప్పందంలో కూడా వాటిని చేర్చింది.దాంతో బెయిడౌ–3 ఉపగ్రహ సేవలను అందుబాటులోకి తెచ్చింది. గతేడాది అమెరికా, ఇజ్రాయెల్ జరిపిన 12రోజుల దాడుల సమయంలో ఇరాన్‌లోని జిపిఎస్ వ్యవస్థను చిన్నాభిన్నం చేశారు. ఆ యుద్ధం తరువాత జూన్ నెలలో పౌర, మిలిటరీ అవసరాలకు బెయిడౌ–3 మీద పూర్తిగా ఆధారపడేందుకు ఇరాన్ ఒప్పందం చేసుకుంది. బీజింగ్ కేంద్రంగా పని చేస్తున్న మిజరావిషన్ అనే ఉపగ్రహ నిఘా కంపెనీ సేవలను కూడా పొందుతున్నది.

తాజా అమెరికా దాడుల సమయంలో ఇజ్రాయిల్‌లోని అవడా విమాన స్థావరంలో ఉంచిన 11 అమెరికా ఎఫ్–22 బాంబర్లు, అమెరికా యుద్ధ నౌకలు, గగనతలంలోనే ఇంధనం నింపుకొనే విమానాల వంటి వాటి చిత్రాలను, సమాచారాన్ని ఆ సంస్థ ఇరాన్‌కు అందచేయటంతో వాటిని గురిచూసి కొట్టిందని వార్తలొచ్చాయి. ఇలాంటి సమాచారం రష్యా కూడా అందచేసి ఉంటుంది. ఈ కారణంగానే ఆ రెండు దేశాలూ సమాచార మిస్తున్నాయని అమెరికా మీడియా రాసింది. ఆధునిక యుద్ధంలో ఆయుధాలతో పాటు శత్రువు కదలికలను పసిగట్టే సమాచారమూ అంతే ముఖ్యమైనది.ఈ రంగంలో అమెరికాకు ధీటుగా చైనా అనేక ఉపగ్రహాలను కలిగిఉంది. ఉక్రెయిన్– రష్యా పోరులో అమెరికా, ఇతర పశ్చిమ దేశాలు అందించిన సమాచారంతోనే ఉక్రెయిన్ అనేక దాడులు చేసి రష్యాకు నష్టం కలిగించిన సంగతి తెలిసిందే. అమెరికా బెదిరింపులతో మనదేశం ఇరాన్ చమురు కొనుగోలు నిలిపివేసింది. ఇతర దేశాలు కూడా అదే చేశాయి. ఈ పూర్వరంగంలో ఇరాన్ చమురు ఎగుమతుల్లో 80శాతం చైనాకే జరుగుతున్నాయి. ఈ మొత్తం చైనా దిగుమతుల్లో 12–15శాతమే. హోర్ముజ్ జలసంధిని ఇతర దేశాల నౌకలకు మూసివేసినప్పటికీ చైనా వాటిని మినహాయించినట్లు వార్తలు వచ్చాయి. అందువలన పరిమితంగానే చైనా ప్రభావితం అవుతుందని భావిస్తున్నారు.

ఇలాంటి మినహాయింపు మనకు ఇవ్వలేదు, కారణం మనం ఇజ్రాయిల్, అమెరికా వైపు మొగ్గటమే. రెండు దేశాల మధ్య వివాదం తలెత్తినపుడు ఎవరి బలాన్ని వారు ప్రదర్శిస్తారు. ఎలాంటి క్షిపణి ప్రయోగంలేకుండానే అమెరికా ఎఫ్–35 యుద్ధ విమానాలను చైనా దెబ్బతీస్తున్నందంటూ తాజాగా ఒక విశ్లేషణ వెలువడింది.అమెరికాకు పోటీగా చైనా మరో యుద్ధాన్ని ప్రారంభించిందని చెబుతున్నారు. ప్రపంచ బలాబలాలను సమతూకం చేసేందుకు చైనా మార్చినెల ఐదున 15వ పంచవర్ష ప్రణాళికను విడుదల చేసింది. పరిశ్రమలు, సాంకేతిక పరిజ్ఞానం, విలువైన ఖనిజాల రంగంలో పురోగతికి దానిలో ప్రాధాన్యత ఇచ్చారు. అది పైకి ఆర్థిక పరమైనదిగా కనిపిస్తున్నప్పటికీ మిలిటరీ లక్ష్యాలు కూడా ఉన్నాయని చడీ చప్పుడు లేకుండా చైనా ముందుకు పోతున్నతీరును ఎవరూ పట్టించుకోవటం లేదంటూ పెట్టుబడుల విశ్లేషకుడు షనాకా అన్సెలెమ్ పెరేరా వాపోయాడు. ఐదేండ్ల కాలంలో కృత్రిమ మేథ వినియోగం ద్వారా పరిశ్రమల్లో 1.4లక్షల కోట్ల డాలర్ల మేర అదనపు ఉత్పత్తిని సాధించాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఇలా అనేక రంగాల గురించి దానిలో పేర్కొన్నారు. సాంకేతిక రంగంలో చైనాను అడ్డుకొనేందుకు అమెరికా ఒక ఇనుపతెరను ఏర్పాటు చేసింది.ఫాక్స్‌సిలికా పేరుతో మనతో సహా అనేక దేశాలతో ఒక వ్యవస్థను రూపొందించింది. ఆధునిక చిప్స్, వాటి తయారీకి అవసరమైన యంత్రాలను అందకుండా ఆంక్షలు విధించిన సంగతి తెలిసిందే. చైనా రూపొందించిన పంచవర్ష ప్రణాళిక ఒక ఆర్థిక పథకం కాదు, అమెరికాతో యుద్ధ ప్రణాళిక అని పెరేరా పేర్కొన్నాడు. అమెరికా చిప్స్ చట్టం ఒక రైఫిల్ వంటిది కాగా చైనా పంచవర్ష ప్రణాళిక ఒక అమ్ముల పొది అని వర్ణించాడు.దీనిలో విలువైన ఖనిజాలు ముఖ్యమైనవి. ప్రస్తుతం ఈ రంగంలో చైనా ప్రపంచంలోనే ఆధిపత్యం వహిస్తున్నది.ఈ ఖనిజాలు విద్యుత్ వాహనాల నుంచి లక్ష్యాల మార్గదర్శనం చేసే వ్యవస్థలు, అత్యాధునిక రాడార్ల వరకు ఎంతో ముఖ్యమైనవి. అమెరికా ప్రతి ఎఫ్–35 ఆధునిక యుద్ధ విమానానికి వందల కిలోల ఖనిజాలు, లోహాలు అవసరం. ఇంజన్లు, సెన్సార్లు, ఆయుధ వ్యవస్థలు, క్షిపణి బ్యాటరీలు, ఎలక్ట్రానిక్ యుద్ధ పరికరాలకు ఇవి లేకుండా పని జరగదు. చైనా మీద అమెరికా 2018 నుంచి వాణిజ్యంతో పాటు చిప్స్ యుద్ధం కూడా చేస్తున్నది.

దీనికి ప్రతిగా బీజింగ్ నూతన ఎత్తుగడలను రంగంలోకి తెచ్చింది. విలువైన ఖనిజాలు, వాటితో ఉత్పత్తుల తయారీకి అవసరమైన ముడిసరకు ఉత్పత్తిలో నైపుణ్యం సాధించి, ఇతర దేశాలకు అందకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నది.వీటి దిగుమతులకు సంబంధించిన అమెరికా రక్షణశాఖ చేసుకున్న ఒప్పందాలు 2027లో ముగుస్తాయి.చైనాకు ప్రత్యామ్నాయం చూసుకోవాలంటే అమెరికాకు సంవత్సరాలు, దశాబ్దం పట్టినా ఆశ్చర్యం లేదని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. ప్రస్తుతం ఇరాన్ పోరులో అమెరికా పెద్ద మొత్తంలో విలువైన ఖనిజాలతో కూడిన ఆయుధాలను వినియోగిస్తున్నది. ఇరాన్ యుద్ధంలో అమెరికన్లు క్షిపణులు, డ్రోన్లను అడ్డుకొనే ఆయుధాలను పెద్ద ఎత్తున వినియోగిస్తున్నారు, మరోవైపు చైనా వాటి తయారీకి అవసరమైన ఆ ఖనిజాల సరఫరాను కఠినతరం కావిస్తున్నదని పెరేరా వాపోయాడు. తెలివితేటలు అమెరికా సొత్తు కాదు. విలువైన ఖనిజాలపై చైనా ఆధిపత్యం రానున్న 15 సంవత్సరాలు ఉంటుందని అంచనా. నిజంగానే చైనా తన పట్టు నిలుపుకుంటే అమెరికా ఎఫ్–35 విమానాలు ఎగిరే అవకాశాలు లేవని కొందరు వ్యాఖ్యానించారు.

నిజంగా తన ఆయుధాలు నాశిరకమైతే చైనా వాటితోఅమెరికాను అడ్డుకోగలదా! చిత్రం ఏమిటంటే చైనా ఆయుధాలను చూసి ఇరుగు పొరుగు దేశాలు ఆధునిక ఆయుధాలను సమీకరించు కుంటున్నట్లు పశ్చిమదేశాల వ్యాఖ్యాతలు పాటపాడుతుంటారు.

# పిత్త దోషాలకు పవర్‌ఫుల్ రెమిడి




వాములో ఎన్నో అద్భుతమైన ఔషధ గుణాలు దాగున్నాయి.. ఇది వాస్తవానికి మన వంటింటిలో సర్వసాధారణంగా కనిపించే ఒక మసాలా దినుసు.. వాము, అనేక ఆరోగ్య ప్రయోజనాలకు నిలయం. దీనిని రోజూ తీసుకోవడం వల్ల శరీరంలో జరిగే మార్పులు ఆశ్చర్యకరంగా ఉంటాయి. వాములో ఎన్నో అద్భుతమైన ఔషధ గుణాలు దాగున్నాయి.. ఇది వాస్తవానికి మన వంటింటిలో సర్వసాధారణంగా కనిపించే ఒక మసాలా దినుసు.. వాము, అనేక ఆరోగ్య ప్రయోజనాలకు నిలయం. దీనిని రోజూ తీసుకోవడం వల్ల శరీరంలో జరిగే మార్పులు ఆశ్చర్యకరంగా ఉంటాయి. ఆయుర్వేద శాస్త్రం ప్రకారం.. వాము "వాతపిత నాశకారి". అంటే ఇది శరీరంలోని వాత, పిత్త దోషాలను సమతుల్యం చేస్తుంది. వాతం అంటే గ్యాస్ సమస్యలు, పిత్తం అంటే ఎసిడిటీ.. ఈ రెండు సమస్యలను వాము సమర్థవంతంగా తగ్గించగలదు. ఈ సమస్యలు ఉన్నవారు వాము నీటిని తీసుకోవడం ఉత్తమం.. ఇది.. జీర్ణక్రియను మెరుగుపరచడం, గ్యాస్, ఎసిడిటీ, కడుపు ఉబ్బరాన్ని తగ్గించడంలో అద్భుతంగా పనిచేస్తుంది. రోజూ ఉదయం ఖాళీ కడుపుతో తాగితే జలుబు, దగ్గు, బరువు తగ్గడం, రోగనిరోధక శక్తి పెంచడంలో సహాయపడుతుంది. ఇది మెరుగైన జీవక్రియ, గుండె ఆరోగ్యం, డెటాక్సిఫికేషన్‌కు కూడా దోహదపడుతుందని ఆయుర్వేద నిపుణులు చెబుతున్నారు.శరీరంలో వాతం (గ్యాస్) అధికమైనప్పుడు, అది కడుపులో అసౌకర్యాన్ని కలిగిస్తుంది. ఈ గ్యాస్ శరీరంలోని బలహీనమైన అవయవాలపై ప్రభావం చూపుతుంది, నొప్పిని కలిగిస్తుంది. ముఖ్యంగా, దెబ్బతిన్న లేదా నొప్పి ఉన్న భాగాలలో గ్యాస్ పేరుకుపోయి నొప్పిని తీవ్రతరం చేస్తుంది. వాము గ్యాస్‌ను తగ్గించడం ద్వారా ఈ రకమైన నొప్పుల నుండి ఉపశమనాన్ని అందిస్తుంది.

ఎసిడిటీ (పిత్త దోషం) కూడా అనేక ఆరోగ్య సమస్యలకు మూలం. గొంతులో మంట, కడుపు నొప్పి, అజీర్ణం, నులిపురుగులు, మధుమేహం, అధిక రక్తపోటు వంటి 80% అనారోగ్యాలు ఎసిడిటీతో ముడిపడి ఉన్నాయని ఆయుర్వేదం చెబుతుంది. వాము ఎసిడిటీని తగ్గించడం ద్వారా ఈ సమస్యలన్నింటినీ నియంత్రించడంలో సహాయపడుతుంది. అసిడిటీ తగ్గినప్పుడు, హార్ట్ ఎటాక్, అధిక రక్తపోటు వంటి తీవ్రమైన సమస్యల ప్రమాదం కూడా తగ్గుతుంది. వామును నీటిలో, పాలలో, కొద్దిగా ఉప్పుతో కలిపి, కూరలలో, మజ్జిగలో ? ఇలా అనేక విధాలుగా ఆహారంలో భాగం చేసుకోవచ్చు. అయితే, అత్యంత ప్రభావవంతమైన పద్ధతి రాత్రిపూట వాము నీటిని తయారుచేసి ఉదయాన్నే తాగడం.. ఒక గ్లాసు నీటిలో ఒక టేబుల్ స్పూన్ వాము వేసి రాత్రంతా నానబెట్టాలి. ఉదయాన్నే నిద్రలేవగానే, బ్రష్ చేయకుండానే, ఆ నీటిని తాగి, నానబెట్టిన వాము గింజలను నమిలి మింగాలి. బరువు తగ్గుదల: ఈ పద్ధతిని క్రమం తప్పకుండా పాటిస్తే, అనవసరమైన పొట్ట కొవ్వు (బెల్లీ ఫ్యాట్), బరువు తగ్గుతుంది. వాము ఒక సమర్థవంతమైన కొవ్వు కరిగించే ఏజెంట్‌గా పనిచేస్తుంది.జీర్ణ సమస్యలు: గ్యాస్, ఎసిడిటీ, మలబద్ధకం వంటి సమస్యలకు వాము దివ్యౌషధం. కడుపు నొప్పికి, రాత్రి నానబెట్టిన వాము నీటిని కొద్దిగా వేడి చేసి, చిటికెడు నల్ల ఉప్పు కలిపి తాగడం ఉపశమనాన్ని ఇస్తుంది.మధుమేహ నియంత్రణ: ఉదయాన్నే వాము నీటిని గోరువెచ్చగా తాగడం వల్ల మధుమేహం నియంత్రణలో ఉంటుంది.శిశువులకు జీర్ణక్రియ: తల్లిపాలు సరిపోనప్పుడు శిశువులకు ఆవు లేదా గేదెపాలు ఇస్తారు. ఈ పాలను జీర్ణం చేసుకోవడానికి వాము చాలా సహాయపడుతుంది. వామును ఒక సన్నని వస్త్రంలో చుట్టి, పాలలో వేసి మరిగించి, ఆ పాలను వడపోసి పసిపిల్లలకు పల్చగా ఇవ్వడం వల్ల గ్యాస్ సమస్యలు లేకుండా పాలు సులభంగా జీర్ణం అవుతాయి. నులిపురుగులు: వాములోని వగరు, చేదు గుణాలు కడుపులోని నులిపురుగులను, హానికరమైన సూక్ష్మక్రిములను నాశనం చేస్తాయి. కడుపు నొప్పి వచ్చినప్పుడు, వేడి అన్నంలో కొద్దిగా నూనె, రెండు స్పూన్ల వాము కలిపి తీసుకోవడం వల్ల జీర్ణవ్యవస్థ మెరుగుపడి, కడుపు నొప్పి తగ్గుతుంది. ఇది కేవలం అవగాహన కోసం మాత్రమే.. ఏదైనా సమస్యలుంటే ఆరోగ్య నిపుణులను సంప్రదించడం ఉత్తమం..


# కొబ్బరి నీళ్లు.. తాగేముందు ఈ నిజాలు తెలుసుకోండి





వేసవి తాపం నుండి ఉపశమనం పొందడానికి మనందరికీ గుర్తొచ్చే మొదటి ఆప్షన్ కొబ్బరి నీళ్లు. అయితే అమృతం లాంటి ఈ సహజ పానీయం అందరికీ ఆరోగ్యకరం కాదన్న విషయం మీకు తెలుసా? ముఖ్యంగా ఉదయాన్నే ఖాళీ కడుపుతో కొబ్బరి నీళ్లు తాగడం వల్ల కొంతమందికి లేనిపోని ఆరోగ్య సమస్యలు ఎదురయ్యే ప్రమాదం ఉంది. ఎండలు ముదురుతున్న వేళ డీహైడ్రేషన్‌ను నివారించడానికి మనందరికీ గుర్తొచ్చే మొదటి డ్రింక్ కొబ్బరి నీళ్లు. ప్రకృతి ప్రసాదించిన ఈ సహజ పానీయం శరీరానికి తక్షణ శక్తిని ఇస్తుంది. అయితే ఆరోగ్యం కోసం ఉదయాన్నే ఖాళీ కడుపుతో కొబ్బరి నీళ్లు తాగే అలవాటు ఉన్నవారు కొన్ని జాగ్రత్తలు పాటించాలని వైద్య నిపుణులు సూచిస్తున్నారు. కొబ్బరి నీళ్లలో పొటాషియం, మెగ్నీషియం, సోడియం, యాంటీఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి. ఇవి శరీరాన్ని హైడ్రేట్ చేయడమే కాకుండా జీవక్రియను మెరుగుపరుస్తాయి. బరువు తగ్గాలనుకునే వారికి ఇది ఒక అద్భుతమైన డీటాక్స్ డ్రింక్. ఇందులో కేలరీలు తక్కువగా ఉండటం వల్ల ఎక్కువసేపు కడుపు నిండిన అనుభూతిని కలిగిస్తుంది. కొబ్బరి నీళ్లు అందరికీ మేలు చేస్తాయనుకోవడం పొరపాటని కొన్ని ఆరోగ్య సమస్యలు ఉన్నవారు వీటిని తీసుకునేటప్పుడు అప్రమత్తంగా ఉండాలని నిపుణులు హెచ్చరిస్తున్నారు. కొబ్బరి నీళ్లలో పొటాషియం అధికంగా ఉంటుంది. ఇది రక్తపోటును మరింత తగ్గించే అవకాశం ఉంది. కాబట్టి, లో–బీపీ ఉన్నవారు ఖాళీ కడుపుతో వీటిని తాగితే తలతిరుగుడు లేదా బలహీనత వంటి సమస్యలు ఎదుర్కోవచ్చు.కొబ్బరి నీళ్లలో సహజ చక్కెరలు ఉంటాయి. ఖాళీ కడుపుతో తాగినప్పుడు శరీరం వీటిని వేగంగా గ్రహిస్తుంది, దీనివల్ల రక్తంలో చక్కెర స్థాయిలు పెరిగే అవకాశం ఉంది. షుగర్ ఉన్నవారు డాక్టర్ సలహా మేరకే వీటిని తీసుకోవాలి.కిడ్నీ సంబంధిత సమస్యలు ఉన్నవారికి కొబ్బరి నీళ్లలోని అదనపు పొటాషియం హానికరం కావచ్చు. పొటాషియం స్థాయిలు పెరిగితే కిడ్నీలపై భారం పడుతుంది.జీర్ణవ్యవస్థ బలహీనంగా ఉన్నవారు ఖాళీ కడుపుతో కొబ్బరి నీళ్లు తాగితే గ్యాస్, కడుపు నొప్పి లేదా విరేచనాలు వంటి సమస్యలు రావచ్చు. డాక్టర్ రాజ్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. కొబ్బరి నీళ్లను ఎప్పుడూ తాజాగా ఉన్నప్పుడే తాగాలి. మరీ చల్లగా ఉన్నవి తీసుకోకపోవడమే మంచిది. రోజుకు ఒక గ్లాసు కొబ్బరి నీళ్లు సరిపోతాయి. ఏదైనా అనారోగ్య సమస్యతో మందులు వాడుతున్న వారు, తమ ఆహారంలో కొబ్బరి నీళ్లను చేర్చుకునే ముందు వైద్యుడిని సంప్రదించడం ఉత్తమం.

# మెట్లు ఎక్కితే కలిగే లాభాలు..



ప్రతి ఏటా కొత్త ఏడాది రాగానే మనం వేసుకునే మొదటి తీర్మానం 'ఆరోగ్యంగా ఉండాలి'. కానీ మార్చి నెల వచ్చేసరికి ఆ జిమ్ మెంబర్‌షిప్‌లు, డైట్ చార్టులు అన్నీ అటకెక్కిపోతాయి. ఆఫీసులో 9–10 గంటల పని, ప్రయాణాలు, ఇంటి పనుల మధ్య వ్యాయామం కోసం సమయం కేటాయించడం చాలా మందికి అసాధ్యంగా మారుతోంది. అయితే, ఫిట్‌నెస్ అంటే కేవలం జిమ్‌కు వెళ్లి గంటల తరబడి చెమటలు చిందించడమే కాదు. కేవలం రెండు నిమిషాల వ్యాయామంతో కూడా అద్భుతాలు చేయవచ్చని పరిశోధనలు చెబుతున్నాయి. ఆరోగ్యం కోసం మనం చేసే తీర్మానాలు ఎందుకు విఫలమవుతాయో తెలుసా? మన జీవనశైలిని పరిగణనలోకి తీసుకోకుండా అసాధ్యమైన లక్ష్యాలను పెట్టుకోవడమే అందుకు ప్రధాన కారణం. నిజానికి ఫిట్‌గా ఉండటానికి ఏసీ గదుల్లో గంటల తరబడి వర్కవుట్లు చేయక్కర్లేదు. ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్‌ఓ) ప్రకారం, శారీరక శ్రమ లేకపోవడం వల్ల మరణించే అవకాశం 20–30% ఎక్కువగా ఉంటుంది. కానీ మన చుట్టూనే ఉండి, మనం రోజూ చూసే ఒక చిన్న పని మన ప్రాణాలను కాపాడుతుందని నిపుణులు చెబుతున్నారు. ఎంతో ఖరీదైన జిమ్ పరికరాలు చేయలేని మ్యాజిక్ ను ఆ చిన్న పని చేస్తుంది. అదేంటో తెలిస్తే ఆశ్చర్యపోతారు.

హార్వర్డ్ నివేదిక ప్రకారం, రోజుకు కేవలం రెండు నిమిషాల తీవ్రమైన శారీరక శ్రమ కూడా శరీరానికి ఎంతో మేలు చేస్తుంది. వారానికి కేవలం 15 నిమిషాల వ్యాయామం మరణాల ముప్పును 18% తగ్గిస్తుంది. అదేవిధంగా వారానికి 19 నిమిషాలు కేటాయిస్తే గుండె జబ్బుల ముప్పు 40% తగ్గుతుందని అధ్యయనాలు వెల్లడిస్తున్నాయి. "ప్రతి చిన్న శారీరక శ్రమ శరీరానికి లెక్కలోకి వస్తుంది" అని కెనడాలోని మెక్‌మాస్టర్ విశ్వవిద్యాలయ నిపుణులు చెబుతున్నారు. వ్యాయామం కోసం ప్రత్యేకంగా సమయం లేని వారికి మెట్లెక్కడం ఒక వరమనే చెప్పాలి. రోజుకు రెండు మూడు సార్లు మెట్లు ఎక్కడం వల్ల జీవితంలో ఊహించని మార్పులు వస్తాయి. మెట్లెక్కడం వల్ల శరీరం గురుత్వాకర్షణ శక్తికి వ్యతిరేకంగా పనిచేయాల్సి ఉంటుంది. దీనివల్ల వేగంగా నడవడం కంటే కూడా మెట్లెక్కడం ద్వారా రక్త ప్రసరణ మెరుగుపడి, ఆక్సిజన్ వినియోగం పెరుగుతుంది.

గుండె ఆరోగ్యం– మెట్లెక్కడం వల్ల విశ్రాంతి సమయంలో ఉండే గుండె వేగం తగ్గుతుంది, ఇది ఆరోగ్యకరమైన గుండెకు సంకేతం. కండరాల దృఢత్వం– ఇది ప్రధానంగా శరీర కింది భాగంలోని కండరాలను బలోపేతం చేస్తుంది. కింది భాగం బలంగా ఉండటం అనేది దీర్ఘాయువుకు ఒక సూచిక. జ్ఞాపకశక్తి– మెట్లెక్కడం వల్ల మెదడుకు రక్తప్రసరణ

పెరిగి జ్ఞాపకశక్తి మెరుగుపడుతుందని కొన్ని నివేదికలు సూచిస్తున్నాయి. బరువు నియంత్రణ– గర్భిణీ స్త్రీలలో రక్తపోటు, మధుమేహం వంటి సమస్యలను తగ్గించడంలో ఇది కీలక పాత్ర పోషిస్తుంది. జిమ్ మెంబర్‌షిప్ వృథా అయిందని బాధపడటం మానేసి, మన రోజువారీ పనుల్లోనే వ్యాయామాన్ని వెతుక్కోవాలి. డాక్టర్లు వద్దని చెబితే తప్ప, సాధ్యమైనంత వరకు లిఫ్టులు, ఎస్కలేటర్లను పక్కన పెట్టండి. రోజుకు కనీసం రెండు మూడు అంతస్తులు మెట్లు ఎక్కడం అలవాటు చేసుకోండి. ఇది మీ ఆరోగ్యాన్ని కాపాడటమే కాకుండా మీ ఆయుష్షును పెంచుతుంది.

# భారత్‌కు ఎదురుందా!

## ఇటలీతో సెమీస్ పోరు నేడు

## రాత్రి 7.30 నుంచి



ఇప్పటికే ప్రపంచకప్ బెర్తును ఖాయం చేసుకున్న భారత మహిళల హాకీ జట్టు ఎఫ్ఐహెచ్ వరల్డ్‌కప్ క్వాలిఫయర్స్ టోర్నీలో కీలక సమరానికి సిద్ధమైంది. శుక్రవారం గచ్చిబౌలి స్టేడియంలో జరిగే సెమీఫైనల్లో ఇటలీతో తలపడనుంది. పూల్ దశలో అజేయంగా నిలిచిన భారత్.. సెమీస్‌లోనూ సత్తాచాటి ఫైనల్ చేరుకోవాలని పట్టుదలగా ఉంది. పూల్-బిలో మూడు మ్యాచ్‌లాడిన భారత్.. ఏడు పాయింట్లతో పట్టికలో అగ్రస్థానం సాధించి.. ప్రపంచకప్ బెర్తును సొంతం చేసుకుంది. పాయింట్ల ప్రకారం స్కాట్లాండ్ కూడా సమంగా నిలిచినా.. గోల్స్ అంతరంలో మెరుగ్గా ఉన్న భారత్‌కు అగ్రస్థానం దక్కింది. పూల్-బిలో భారత్ రెండు విజయాలు, ఒక డ్రా నమోదు చేయగా.. పూల్-ఎలో ఒక్కో గెలుపు, ఓటమి, డ్రాతో నాలుగు పాయింట్లు సాధించిన ఇటలీ రెండో స్థానంలో నిలిచింది. టోర్నీ గణాంకాల ప్రకారం సెమీస్‌లో ఆతిథ్య జట్టే ఫేవరెట్‌గా కనిపిస్తోంది. స్టార్ స్ట్రైకర్ నవనీత్ కౌర్ అద్భుత ఫామ్‌లో ఉండటం భారత్‌కు కలిసొచ్చే అంశం. ఈ టోర్నీలో అత్యధిక గోల్స్ చేసిన ప్లేయర్లలో ఆమె నాలుగు గోల్స్‌తో అగ్రస్థానంలో ఉంది. వేల్స్‌తో జరిగిన చివరి పూల్ మ్యాచ్‌లో నవనీత్ హ్యాట్రిక్‌తో మెరిసింది. 2012 నుంచి ఇరు జట్లు ఏడు సార్లు తలపడగా.. అయిదింట్లో గెలవడం భారత్‌కు సానుకూలాంశం. ఇటలీ కేవలం ఒక్క మ్యాచ్‌లో నెగ్గగా.. మరో పోరు డ్రాగా ముగిసింది.

# సుమిత్ పసిడి త్రో



దిల్లీ: పారా జావెలిన్ స్టార్ ఆటగాడు సుమిత్ అంటిల్ ప్రపంచ పారా గ్రాండ్‌ప్రిలో స్వర్ణంతో మెరిశాడు. ఫైనల్లో సుమిత్ అత్యుత్తమంగా 69.25 మీటర్లు విసిరి అగ్రస్థానంలో నిలిచాడు. భారత్‌కే చెందిన పుష్పేంద్ర సింగ్ (56.91 మీ), పూనమ్ రామ్ (49.48 మీ) వరుసగా రజత, కాంస్య పతకాలు గెలుచుకున్నారు. పురుషుల టీ13, 400 మీటర్లలో సుభోద్ భట్ స్వర్ణంతో మెరిశాడు. అతడు 51.88 సెకన్లలో లక్ష్యాన్ని చేరుకున్నాడు. ప్రియాంశు కౌశిక్ (53.19 సె), అన్విల్ కుమార్ (56.91 సె) తర్వాతి స్థానాలు దక్కించుకున్నారు. మహిళల టీ11/12, 400 మీటర్లలో తేజల్‌బెన్ (57.53 సె) స్వర్ణం కైవసం చేసుకుంది. లలిత (1 నిమిషం 7.92 సె), షాలిని చౌదరి (1 నిమిషం 16.79 సె) వరుసగా రజత, కాంస్య పతకాలు నెగ్గారు.



# ఒత్తిడిలోనే రాణిస్తా

అహ్మదాబాద్: ఒత్తిడి ఉన్నప్పుడే రాణించాలని అనుకుంటానని భారత స్టార్ పేసర్ జస్‌ప్రీత్ బుమ్రా అన్నాడు. "వెనకాల దాక్కోవాలని అనుకోను. సవాళ్లను ఎదుర్కొంటా. ఒత్తిడిలో.. క్లిష్టమైన పరిస్థితుల్లో రాణించడాన్ని ఇష్టపడతా. అలాంటి ఉద్దేశంతోనే క్రికెట్లోకి వచ్చా. నా బౌలింగ్‌తో మ్యాచ్‌ను మలుపు తిప్పగలిగితే ఎంతో ఆనందంగా అనిపిస్తుంది. దాన్ని మించిన సంతోషం ఏదీ ఉండదు" అని బుమ్రా తెలిపాడు. అహ్మదాబాద్‌లోనే క్రికెట్ కెరీర్‌ను ఆరంభించానని.. అదే వేదికలో ప్రపంచకప్ అందుకున్నానని బుమ్రా అన్నాడు. "అహ్మదాబాద్‌లోనే క్రికెట్ మొదలుపెట్టా. గుజరాత్‌కు ఆడా. ఇప్పుడు భారత ప్రపంచకప్ విజయంలో కీలకపాత్ర పోషించి.. 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్' అందుకున్నా. ఇదే వేదికలో 2023 వన్డే ప్రపంచకప్ ఫైనల్లో కొద్దిలో ఓడిపోయాం. ఇప్పుడు ఇక్కడే టీ20 ప్రపంచకప్ నెగ్గడం చాలా సంతోషంగా ఉంది. వరుసగా రెండు ప్రపంచకప్‌లు నెగ్గిన జట్టులో ఉండడం ఇంకా ప్రత్యేకం" అని బుమ్రా పేర్కొన్నాడు.



లేత-రంగు చీరలో ప్రియా భవాని శంకర్ స్టన్స్

# మొత్తానికి ఫేవరెట్ స్టార్ తో జాన్వీకపూర్!

ఎంత పెద్ద హీరోయిన్ అయినా అభిమాన హీరో అంటూ ఒకరుంటారు. నటిగా కెరీర్ ముగిసే లోపు ఒక్క సారైనా ఆ స్టార్ సరసన నటించాలని కోరుకుంటారు. కానీ అలా అందరి హీరోయిన్ల విషయంలో జరగదు. ఎంత ట్యాలెంట్ ఉన్నా? అదృష్టం కూడా కలిసొస్తేనే ఛాన్స్ అందుకోగలరు. పవన్ కళ్యాణ్ సరసన అనుష్క నటించాలని ఎంతో కాలంగా అనుకుంటోంది. కానీ ఆ కాంబినేషన్ ఇంత వరకూ సెట్ కాలేదు. ఏ దర్శకుడు కూడా వాళ్లిద్దర్నీ కలిపే ప్రయత్నం కూడా చేయలేదు. అలాగని పవన్ ఇమేజ్ కు సరితూగని హీరోయిన్ అంటే? అదీ కాదు అనుష్కను అభిమానించే తెలుగు వారు ఎంతో మంది ఉన్నారు.మరెందుకు నటించలేదంటే కాలం కలిసి రాకనే చెప్పాలి. ఆ సంగతి పక్కన బెడితే? జాన్వీ కపూర్ అభిమాన స్టార్ ఎవరు? అంటే రణబీర్ కపూర్ అని అందిరికీ తెలుసు. మరి అతడితో జాన్వీ సినిమా చేసిందా? అంటే ఇంత వరకూ సాధ్యపడలేదు. చాలా కాలంగా రణబీర్ కపూర్ సరసన నటించాలని జాన్వీ భావిస్తోంది. ఓపెన్ గానే ఈ విషయాన్ని చాలాసార్లు చెప్పింది. కానీ బాలీవుడ్ మేకర్స్ ఎవరూ పట్టించుకోలేదు.



తాజాగా ఆమె ఆసక్తిని మోహిత్ సూరి గమనించాడో? ఏమోగానీ ఆ ఛాన్స్ తానే ఇస్తానంటూ ముందుకొచ్చాడు. రణబీర్ కపూర్ హీరోగా ఓ గ్యాంగ్ స్టార్ మ్యూజికల్ లవ్ స్టోరీని తెరకెక్కించడానికి రెడీ అవుతున్నారు. వాస్తవానికి మోహిత్ సూరి కూడా చాలా కాలంగా రణబీర్ తో సినిమా చేయాలనుకుంటున్నాడు. కానీ రణబీర్ వేర్వేరు సినిమాలతో బిజీగా ఉండటంతో సాధ్యపడలేదు. ఇంతకాలానికి ఆ కాంబినేషన్ సెట్ అయింది. ఇందులో హీరోయిన్ గా ఎవర్ని తీసుకోవాలి? అనే చర్చ మోహిత్ టీమ్ లో జరగగా..ఆయన మరో ఆలోచన లేకుండా జాన్వీ కపూర్ ను ఫిక్స్ చేసారట. జాన్వీ కపూర్ ఆసక్తిని గమనించే మోహిత్ ఈ ఛాన్స్ కల్పించినట్లు వెలుగులోకి వస్తోంది. తాను ఎవరో నటిని తీసుకోవడం కంటే? అభిమాన హీరోకి జోడీగా తననే తీసుకుంటే? కెమిస్ట్రీ కూడా వర్కౌట్ అవుతుంది. చాలా సన్నివేశాల విషయంలో రాజీ పడాల్సిన పని ఉండదు. పైగా మోహిత్ సినిమాల్లో రొమాంటిక్ సన్నివేశాల్లో ఘాటత కూడా ఎక్కువగానే ఉంటుంది. హీరోతో ఇంటిమేట్ సన్నివేశాలకు సైతం నో చెప్పడానికి ఛాన్స్ ఉండదు. సెట్స్ కు వెళ్లిన తర్వాత ఏ నటి అయినా దర్శకుల హీరోయిన్ గా పనిచేయాల్సిందే. అందుకు జాన్వీ కపూర్ ఎప్పుడూ సిద్ధంగానే ఉంటుంది. ప్రస్తుతం అమ్మడు తెలుగులో 'పెద్ది' లో రామ్ చరణ్ కు జోడీగా నటిస్తోన్న సంగతి తెలిసిందే. బాలీవుడ్ లో మాత్రం మోహిత్ సూరి ప్రాజెక్ట్ తప్ప ఇంకే సినిమాకు కమిట్ అవ్వలేదు. మోహిత్ సూరి పిలిచి ఇస్తోన్న అవకాశం కాబట్టి జాన్వీ ఆనందంతో ఉబ్బితబ్బితోంది.

PENSATTA TELUGU DAILY Printed, Published, Owned by CHITAMANENI ANIL KUMAR, D.NO 1-1, RAJULA ILLA PAKKANA, VENKATAPURAM, THANAM POST, MUNGAPAKA MANDAL, ANAKAPALLI VISHAKAPATNAM, ANDHRA PRADESH 531021 ,Publishe at D.NO 1-1, RAJULA ILLA PAKKANA, VENKATAPURAM, THANAM POST, MUNGAPAKA MANDAL, ANAKAPALLI VISHAKAPATNAM, ANDHRA PRADESH 531021 . And Printed at Chaitanya Vaaradhi printers, Do.No 2-99 Bharanikam, Paravada Anakapalli, Visakhapatnam- 531 021. Editor: CHITAMANENI ANIL KUMAR, D.NO 1-1, RAJULA ILLA PAKKANA, VENKATAPURAM, THANAM POST, MUNGAPAKA MANDAL, ANAKAPALLI VISHAKAPATNAM, ANDHRA PRADESH 531021 , Cell: 99853 15759, RNI. No APTEL/2023/87729, E-mail:anilchinthamneni@gmail.com